# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



**విలేకరులు కావలెను**

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 137 | పేజీలు : 08 | సోమవారం | 25-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.





### రాహుల్ మెరుపులు, కుల్దీప్ మాయ.. కేకేఆర్‌పై
# ఢిల్లీ ఘనవిజయం

- కేకేఆర్‌పై 40 పరుగుల తేడాతో గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్
- 30 బంతుల్లో 60 పరుగులు చేసిన కేఎల్ రాహుల్
- రహానే పోరాడినా కుప్పకూలిన కోల్‌కతా బ్యాటింగ్ లైనప్
- చెరో మూడు వికెట్లతో చెలరేగిన ఎంగిడి, కుల్దీప్ యాదవ్
- విజయంతో ఐపీఎల్ 2026 ప్రస్థానాన్ని ముగించిన ఢిల్లీ

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ ప్రస్థానాన్ని విజయంతో ముగించింది. ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కేఎల్ రాహుల్ (60) మెరుపు అర్ధశతకానికి తోడు, బౌలింగ్‌లో లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్ చెరో మూడు వికెట్లతో చెలరేగడంతో ఢిల్లీకి ఓదార్పు విజయం లభించింది. ఈ విజయంతో ఢిల్లీ

### రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు
# వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్లకు పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ సూచన**

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేసిన మంత్రి ఉత్తమ్
- దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి తెలంగాణలోనే అని వెల్లడి
- రైతులను మోసంచేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించిన మంత్రి




**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని అన్ని జిల్లా కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు, శాసన సభ్యులకు పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ సూచించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల భవనంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. జిల్లాల నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ సహా కలెక్టర్ల్ స్థానికంగా కొనుగోలు చేసిన వివరాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు.సీఎస్ కృష్ణారావు సైతం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని దేశ చరిత్రలో ఎక్కువ ధాన్యం మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అయిందని రాష్ట్ర ప్రభుత్వం

### హైదరాబాద్ లాయర్ హత్య కేసులో
# నిందితుల అరెస్ట్

- నిందితులను గోవాలో అదుపులోకి తీసుకున్న హైదరాబాద్ పోలీసులు
- కారుతో ఢీకొట్టి మొయినుద్దీన్‌ను హత్య చేసిన దుండగులు
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు






### ఇరాన్ అణ్వాయుధాలను
# కోరుకోవడం లేదు

- అణ్వాయుధాల కోసం తాము ప్రయత్నించడం లేదన్న ఇరాన్
- పశ్చిమాసియాలో అశాంతికి ఇజ్రాయెలే కారణమని ఆరోపణ
- ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి ఉందన్న అమెరికా
- హర్మూజ్ జలసంధిపై శుభవార్త రావచ్చని సంకేతాలు
- దేశ గౌరవంతో రాజీపడబోమని స్పష్టం చేసిన ఇరాన్ అధ్యక్షుడు



# రేవంత్‌కు మోదీ ఆఫర్..

**భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చు**

- సువేందు అధికారి, షిండేకు ఇచ్చినట్టుగా రేవంత్ కు మోదీ ఆఫర్ ఇచ్చి ఉండొచ్చన్న అర్వింద్
- ఆఫర్ తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పాశ్చాత్తాప పడొచ్చని వ్యాఖ్య
- భగీరథ్ పై పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందన్న ప్రచారాన్ని ఖండించిన అర్వింద్



### ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ
# మోటార్లకు మీటర్లు..

**కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్**




- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
- ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
- మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
- గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ

### ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు
# తక్షణమే ఎత్తివేయండి

**ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి**

- జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్
- ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు
- పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు




# రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర

- రైతులతో రాజకీయాలు చేయడం రేవంత్ కు అలవాటుగా మారిందన్న రఘునందన్ రావు
- అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి ప్రజలకు సీఎం తప్పుడు సమాచారం ఇస్తున్నారని విమర్శ
- ప్రభుత్వ వైఫల్యాలపై నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామన్న బీజేపీ ఎంపీ




# నదిలో మునిగి ఒకే కుటుంబంలోని 8మంది మృతి

- ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం
- నీటిలో మునిగి 8 మంది దుర్మరణం
- వెంకటాపుర నదిలో ఒక్కసారిగా నీటి మట్టం పెరగడమే కారణం




**హైదరాబాద్ పల్స్,డెస్క్**

కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా భట్కల సమీపంలోని తత్తెహక్కలు నదిలో నత్తగుల్లల సేకరణ కోసం దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈక్రమంలో 8 మంది మృతదేహాలను వెలికితీశారు. మృతులందరినీ భట్కల తాలూకా సిరాలి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం (ఎక్స్‌గ్రేషియా) ప్రకటించారు.

"ఉత్తర కన్నడ జిల్లాలోని నదీతీర ప్రాంత ప్రజలు సీజనల్?గా ఇలా గుల్లలు సేకరిస్తుంటారు. అదే విధంగా శిరాలీ గ్రామానికి చెందిన సుమారు 14 మంది నత్తగుల్లల (కప్పగుల్లలు) సేకరణ కోసం నదిలోకి దిగారు. అయితే వారు నీటి మట్టాన్ని సరిగ్గా అంచనా వేయకుండా నదిలో లోతైన ప్రాంతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో ఒకరిద్దరు కొట్టుకుపోయారు. దీనితో వారికి రక్షించేందుకు మరికొందరు నదిలోకి దూకారు. కానీ వారు కూడా బలమైన నీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. ఇప్పటి వరకు 8 మంది

# పార్లమెంట్ తరహాలో తెలంగాణ శాసనసభ

- రాబోయే సమావేశాల నాటికి సమూల మార్పులు
- అసెంబ్లీ లోపల భారీ మార్పులకు సిద్ధమైన ప్రభుత్వం
- రాబోయే అసెంబ్లీ నాటికి పూర్తి చేసే దిశగా కసరత్తు
- మంత్రుల ఛాంబర్ల పునర్వ్యవస్థీకరణ పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరి మార్చేందుకు సిద్ధం




**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

అసెంబ్లీని పార్లమెంట్ తరహాలో తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనులు వేగవంతం చేసింది. ఇప్పటికే శాసనమండలిని అసెంబ్లీ ప్రాంగణానికి తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అసెంబ్లీ భవనం లోపల కూడా సమూల మార్పులు చేపడుతోంది. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాను కూడా కొంతవరకు నియంత్రించే దిశలో ప్రభుత్వం యోచిస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులకు అవసరమైన గోప్యత కల్పించేలా సమతుల్య విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది.

**మరింత సమన్వయంతో నిర్వహణ**

అసెంబ్లీ పక్కనే ఉన్న చారిత్రక హెరిటేజ్ భవనాన్ని ఆధునీకరించి శాసన మండలిగా మార్చిన ప్రభుత్వం

# హైదరాబాద్ లాయర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన న్యాయవాది కాజా మొయినుద్దీన్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా నలుగురిని గోవాలో అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కారును కబాడీగూడకు చెందిన వినయ్ అనే వ్యక్తి నడిపినట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే, గత శనివారం (మే 23) మాసబ్‌ట్యాంక్ వద్ద మొయినుద్దీన్ తన నివాసం నుంచి కారులో బయలుదేరుతున్న సమయంలో, వేగంగా వచ్చిన మరో కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మొయినుద్దీన్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు. ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఈ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, వినయ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి, అతడితో పాటు మరో ముగ్గురిని గోవాలో అదుపులోకి తీసుకున్నారు.

## రాహుల్ మెరుపులు, కుల్దీప్ మాయ.. కేకేఆర్‌పై
# ఢిల్లీ ఘనవిజయం

మొదటి పేజీ తరువాయి

పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. కేఎల్ రాహుల్ కేవలం 30 బంతుల్లోనే 60 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (28), అక్షర్ పటేల్ (39) కూడా రాణించడంతో ఢిల్లీ ఈ వేదికపై తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది. అనంతరం 204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు కెప్టెన్ అజింక్యా రహానే (39 బంతుల్లో 63) అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. దీంతో కేకేఆర్ సులభంగా గెలుస్తుందనిపించింది. కానీ, కీలక సమయంలో కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్లో వరుస బంతుల్లో రహానే, రింకూ సింగ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆ తర్వాత కేకేఆర్ పతనం మొదలైంది. 128/3తో పటిష్టంగా ఉన్న కోల్‌కతా, కేవలం 35 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయి 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌట్ అయింది. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి, కుల్దీప్ యాదవ్ చెరో 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలక పాత్ర పోషించారు.

## ఇరాన్ అణ్వాయుధాలను
# కోరుకోవడం లేదు

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తాము కోరుకోవడం లేదని, ఈ విషయంలో ప్రపంచానికి హామీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. "ఈ ప్రాంతంలో అశాంతిని కోరుకుంటున్నది తాము కాదు. జియోనిస్ట్ ప్రభుత్వం (ఇజ్రాయెల్) మాత్రమే యుద్ధాన్ని, అశాంతిని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది" అని పెజెష్కియాన్ ఆరోపించారు. 'గ్రేటర్ ఇజ్రాయెల్' ప్రణాళికను ఇజ్రాయెల్ అనుసరిస్తోందని విమర్శించారు. దేశ గౌరవంతో చర్చల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని ఆయన తేల్చిచెప్పారు. ఇరాన్‌లో ఏ నిర్ణయమైనా సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ఎన్ఎస్ సీ) పరిధిలోనే, సుప్రీం లీడర్ అనుమతితోనే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. రాబోయే గంటల్లో హర్మూజ్ జలసంధికి సంబంధించి 'శుభవార్త' వెలువడవచ్చని ఆయన సూచించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని రూబియో మరోసారి పునరుద్ఘాటించారు.

# రైతు గోస – బీజేపీ భరోసా' యాత్ర

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ
# మోటార్లకు మీటర్లు..

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు
# తక్షణమే ఎత్తివేయండి

మొదటి పేజీ తరువాయి

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# పార్లమెంట్ తరహాలో తెలంగాణ శాసనసభ

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ లోపల భారీ మార్పులకు సిద్ధమైంది. అసెంబ్లీ, శాసనమండలి రెండూ ఒకే ప్రాంగణంలో కొనసాగుతుండటంతో శాసన వ్యవహారాల నిర్వహణ మరింత సమన్వయంతో సాగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల నాటికి భవనం లోపల భారీ మార్పులు పూర్తి చేసే దిశగా పనులు జరుగుతున్నాయి.

ఉభయ సభల సభ్యుల సమావేశానికి

మంత్రుల ఛాంబర్ల పునర్వ్యవస్థీకరణ, పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరి తీర్చిదిద్దుతున్నారు. లాబీల మార్పులు, ఆధునిక సదుపాయాల ఏర్పాటు, భద్రతా ప్రమాణాల కట్టుదిట్టం వంటి పనులూ కొనసాగుతున్నాయి. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఉభయ సభల సభ్యులు సమావేశమయ్యే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసే ఆలోచన కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారులతో స్వేచ్ఛగా చర్చించే విధంగా

మరోవైపు అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా సంచరణపై ప్రభుత్వం నియంత్రణ అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రుల ఛాంబర్లలోకి తరచూ మీడియా ప్రతినిధులు వెళుతుండటంపై పలువురు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రతిదీ మీడియా సమక్షంలోనే జరుగుతోందని.. దీంతో అధికారులతో స్వేచ్ఛగా చర్చించే పరిస్థితి లేకుండా పోతోందని మంత్రులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

ప్రత్యేక మీడియా జోన్లు

ఈ క్రమంలో పార్లమెంట్ తరహాలోనే అసెంబ్లీలో మీడియా ప్రవేశాన్ని క్రమబద్ధీకరించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రత్యేక మీడియా జోన్లు ఏర్పాటు చేయడం పరిమిత ప్రాంతాల్లోనే మీడియా కవరేజ్‌కు అనుమతి ఇవ్వడం, మంత్రుల ఛాంబర్ల వద్ద నియంత్రిత ప్రవేశ విధానం అమలు చేయడం వంటివి పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మీడియా స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా.. అదే సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవసరమైన గోప్యత కల్పించేలా సమతుల్య విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. హైదరాబాద్? నగర నడిబొడ్డున ప్రధాన రహదారిపై ఎంతో అందంగా ఉన్న శాసనసభ భవనం అటుగా వెళ్లే ప్రయాణికులను ఎల్లప్పుడూ ఆకర్షిస్తూనే ఉంటుంది. భాగ్యనగర చరిత్రలో భాగస్వామి అయిన ఈ భవనానికి ఎంతో విశిష్టత ఉంది. సహజంగా ప్రభుత్వ భవనాన్ని ప్రభుత్వ ఖజానాతోనో లేక దాతల సహకారంతోనో నిర్మించడం చూస్తాం. కానీ ఈ భవనం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా రూపుదిద్దుకుంది. ప్రజలే తమ సొంత డబ్బుతో అప్పటి హైదరాబాద్? నిజాం రాజు కోసం బహుమతిగా నిర్మించారు. హైదరాబాద్‌ను ఏకఛత్రాధిపత్యంపై శాసించిన అసఫ్ జాహీ వంశంలో ఆరో నిజాం రాజైన మీర్ మహబూబ్ అలీఖాన్ 1866 ఆగస్టు 17న జన్మించారు. రెండున్నరేళ్ల వయసులోనే ఆయన ఈ హైదరాబాద్? రాజ్యానికి రాజుగా పట్టాభిషేకం చేసుకున్నారు. మీర్? మహబూబ్ అలీఖాన్ 50వ పుట్టినరోజు అంటే 1915 నాటికి బహుమతిగా ఇచ్చేలా ఓ కట్టడాన్ని నిర్మించాలని భావించి ఈ భవనాన్ని మొదలుపెట్టారు. ఓ రాజప్రాసాదంగా ఉండేలా అద్భుతంగా నిర్మించాలని భావించారు. భవన నిర్మాణానికి అప్పట్లోనే రూ. 19 లక్షలు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఆ మొత్తాన్ని ప్రజలే తమ సొంత డబ్బును విరాళంగా ఇచ్చి కట్టడం అనేది గొప్ప విషయం.

# రేవంత్‌కు మోదీ ఆఫర్..

మొదటి పేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఒక ఛాన్స్ ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేలకు ఇచ్చిన తరహాలోనే రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఆఫర్ ఇచ్చి ఉండవచ్చని, ఈ ప్రతిపాదనను తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడాల్సి రావచ్చని వ్యాఖ్యానించారు. ఇక పార్టీ అంతర్గత వ్యవహారాలు, వివాదాలపై కూడా అరవింద్ ఓపెన్‌గా స్పందించారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో ఉన్న విభేదాలపై మాట్లాడుతూ.. పార్టీలో అభిప్రాయ భేదాలు సహజమని, అయితే తాను ఎవరిపైనా అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయలేదన్నారు. అలాగే బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, ఆ ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదన్నారు. పోక్సో కేసు నమోదైన తర్వాత తాను బండి సంజయ్ తో మాట్లాడలేదని చెప్పారు. గతంలో తానే రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలని కోరానని, అయితే కొత్తగా పార్టీలోకి రావడంతో అది కుదరదని అధిష్ఠానం తేల్చి చెప్పినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి వస్తున్నా, తెలంగాణలో మాత్రం అధికారం చేరువలో కనిపించకపోవడానికి స్థానిక నాయకత్వ సమస్యలే కారణమని అర్వింద్ అంగీకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ తరహాలో పెద్ద గ్రూప్ లీడర్లు లేకపోవడం తమ పార్టీకి ప్రధాన సమస్యగా మారిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తాము అధికారంలోకి రాకపోవడం తమ పార్టీ తప్పేనని, ప్రజలు ఆ సమయంలో తమను కోరుకోలేదన్నది నిజమని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని సగం క్యాబినెట్‌లో క్వాలిటీ కాంగ్రెస్ లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర పనిచేసేందుకు మంత్రులే ఇష్టపడటం లేదని అన్నారు.



## రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు
# వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

వాటిని కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతలకు మేలు చేస్తున్న ప్రభుత్వం విధానాలను అందరం కలిసి అవగహన కల్పించాలని చెప్పారు.

రైతు అనుకూల విధానాలు

ప్రతిపక్షం చేసే నిరాధార ఆరోపణలను ఖండించాలని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇప్పటికే 58.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొని 8,749 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసామని వెల్లడించారు. మిగిలిన వాటిని వారంలోనే కొనుగోలు చేసేలా ప్రణాళికలు రచించామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం మొత్తం ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ సమస్యలు వచ్చేవి కాదని చెప్పారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ రైతు అనుకూల విధానల వలన పంట ఉత్పత్తి పెరిగిందని వెల్లడించారు.

ఇలా ఎప్పుడూ, ఎక్కడా జరగలేదు

రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులను ఇంత భారీగా కొన్న రాష్ట్రం మరొకటి లేదని పేర్కొన్నారు. ఇన్ని వేల కోట్లతో వరి ధాన్యం కొనుగోలు ఎక్కడా ఎప్పుడూ జరగలేదని వెల్లడించారు. ఖరీఫ్, రబీ పంటలకు కలిపి రూ.42 వేల కోట్ల నుంచి రూ.45 వేల కోట్లు చెల్లిస్తున్నామన్నారు. తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. లారీల కొరత ఉందని అధికారులు చెప్తున్నారని దీనికోసం ఇసుక, సిమెంట్ రవాణా లారీలను వాడుకోవాలని అధికారులను సూచించామన్నారు.

ధాన్యం తడిచినా అధికారులు కొనాల్సిందే

రైసు మిల్లుల్లో తెలంగాణ ప్రజలు చాలా తక్కువగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో ఎక్కువగా బిహార్, బెంగాల్ రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బెంగాల్ కార్మికులు ఈసారి ఓట్ల కోసం వెళ్లి చాలా మంది తిరిగి రాలేదని చెప్పారు. కార్మికులు, లారీల కొరత వల్లే ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందని వెల్లడించారు. వర్షాల వల్ల ధాన్యం తడిచినా అధికారులు కొనాల్సిందేనని ఆదేశించారు. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి, కొరత లేదన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దని ఆజ్ఞాపించారు.

## నదిలో మునిగి ఒకే కుటుంబంలోని
# 8మంది మృతి

మొదటి పేజీ తరువాయి

మృతదేహాలను వెలికితీశాం. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి" అని పోలీసులు తెలిపారు.

మృతుల వివరాలు

మృతులను ఉమేశ్ మంజునాథ్ నాయక్(40), లక్ష్మి మహాదేవ్ నాయక్ (42), లక్ష్మి జట్టప్ప నాయక్ (30), లక్ష్మి అప్పన్న నాయక్ (60), లక్ష్మి శివరామ్? నాయక్? (49), జ్యోతి మస్తమ్మ నాయక్? (34), మాలతి నాయక్? (38), మస్తమ్మ నాయక్? (60)గా గుర్తించారు. ఇక నీటి ప్రవాహంలో చిక్కుకున్న నాగరత్న, మహాదేవిలను రక్షించి, వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రెస్క్యూ సిబ్బంది, పోలీసు బృందాలు, స్థానికులు నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన 8 మంది చనిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్రమాదానికి గల కారణాలు ఏంటి?

ఈ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా నదిలీ ప్రవాహ ఉద్ధృతి ఒక్కసారిగా పెరిగిందని, గుల్లలను సేకరిస్తూ నదిలోని లోతైన ప్రాంతాల్లోకి వెళ్లిన పలువురు ఈ ప్రవాహంలో చిక్కుకొని కొట్టుకొనిపోయారని పోలీసులు పేర్కొన్నారు. "చేపల వేటలాగే, నత్తగుల్లలు సేకరణ అనేది కొందరికి జీవనోపాధి కల్పించే ఒక వృత్తిగా ఉంది. మునిగిపోయిన వారిలో చాలా మందికి ఈ పనిలో మంచి అనుభవం ఉంది. వారిలో చాలా మందికి ఈత కూడా వచ్చు. అందుకే ప్రమాదానికి గల కారణాలపై ఇంకా నిర్ధరించాల్సి ఉంది" అని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ సాయం ప్రకటన

ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "అత్యంత విషాదకరమైన, బాధాకరమైన ఘటన ఇది. దీని గురించి తెలిసిన తర్వాత తీవ్ర మానసిక వేదనకు గురయ్యాను. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. మానవతా దృక్పథంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందిస్తాం. ఇక గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారు క్షేమంగా తిరిగి రావాలని దేవుడిని ప్రార్థిద్దాం" అని అన్నారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా ఇంద్రేశం మున్సిపాలిటీ : ఎమ్మెల్యే జీఎంఆర్

**వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :** నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీనీ అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, రామేశ్వరంబండ, ఐనోలు, ఇంద్రేశం, బచుగూడెం వార్డులలో 15 కోట్ల రూపాయల అంచనా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ఉదయం స్థానిక మున్సిపల్ పాలకవర్గం తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని 5 మున్సిపాలిటీలలో ప్రజలు నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలలో సీసీ రోడ్లు, యూజీడీలు, పార్కులు, రక్షిత మంచినీరు అందించడానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు..పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కుశంగుల ప్రమీల, వైస్ చైర్మన్ పట్లోల్ల హరీష్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, లావణ్య, పట్లోల లత రెడ్డి, పాశం ఊర్మిళ రెడ్డి, రమేష్, చిమల్దారి రమేష్, పట్లోల్ల అంజలి రెడ్డి, అంబిలి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సుమతి, సల్మాన్ ఖాన్, నసీమ బేగం, మాజీ ప్రజా ప్రతినిధులు శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ రెడ్డి, రామచందర్, నర్సింలు, జంగారెడ్డి, బండి శంకర్, అనిల్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు కాంగ్రెస్‌లో పెద్దపీట

**సీరోల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లిమీకంటి సురేష్ నియామకం**



**హైదరాబాద్ పల్స్, మే 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకత్వానికి మరింత ప్రాధాన్యతనిచ్చింది. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా ఇంచార్జ్ భూక్య వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులకు నూతన బాధ్యతల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీరోల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లిమీకంటి సురేష్ను అధికారికంగా నియమించారు. నియామక పత్రాన్ని అందజేసిన నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మల్లిమీకంటి సురేష్ మాట్లాడుతూ, యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మండల పరిధిలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అక్రమ సంబంధానికి అడ్డుగా మారాడని... ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, నారాయణఖేడ్:** అక్రమ సంబంధానికి అడ్డుగా మారాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం ఎల్గోయి గ్రామంలో కలకలం రేపింది. నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చెంబనుల్ల ముత్యం రెడ్డి (35) బోరు మోటర్ల రిపేర్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అతని భార్య కల్పన నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఇదే సమయంలో మనూరు మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గౌని పండరి ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కల్పన, పండరి మధ్య పరిచయం పెరిగి అక్రమ సంబంధంగా మారినట్లు సమాచారం. భర్త తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన ఇద్దరూ కలిసి హత్యకు పన్నాగం పన్నారు. తొమ్మిది రోజుల క్రితం ముత్యం రెడ్డిని నారాయణఖేడ్ -- రాయిపల్లి రోడ్డులోని ఓ దాబాకు తీసుకెళ్లి మద్యం తాగించి భోజనం చేశారు. అనంతరం ఎల్గోయి గ్రామ శివారులోని చేనుకు తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఎవరికి అనుమానం రాకుండా ముందుగానే "తాత సమాధి నిర్మాణం కోసం" అంటూ జేసీబీతో గుంత తవ్వించి, అదే గుంతలో మృతదేహాన్ని పాతిపెట్టినట్లు తెలిసింది. భర్త కనిపించకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా, కల్పన ఫోన్ కాల్ డేటాలో అనుమానాస్పద వివరాలు బయటపడ్డాయి. విచారణలో పండరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా హత్య చేసిన విషయాన్ని ఒప్పుకుని మృతదేహం పాతిపెట్టిన ప్రదేశాన్ని చూపించాడు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది. ముత్యం రెడ్డికి ఐదేళ్ల కుమార్తె ఉంది. భార్యే భర్తను హత్య చేసిందన్న విషయం



తెలిసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటన స్థలానికి డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ఖాళీల కొరత తీరేదెన్నడు?

**రాజపేట మండలానికి మళ్లీ కష్టాలే**
**కొనసాగనున్న పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా మారుమూల మండలం అయిన రాజపేటలో పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు కొనసాగనున్నాయి. ఇటీవల నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల బదిలీ కౌన్సిలింగ్ లో కూడా రాజపేట మండలంలో పూర్తిగా కార్యదర్శుల పోస్టులు భర్తీ కాలేదు. 23 గ్రామపంచాయతీలలో కొత్తగా 7 గ్రామాలకు కార్యదర్శులు బదిలీపై రాగా, 11 గ్రామాలలో ఇంతవరకు కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 5 గ్రామపంచాయతీల పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. ఇప్పటి వరకు 6 గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో మిగిలిన ఆరుగురు కార్యదర్శులు అదనపు బాధ్యతలు తీసుకున్నారు. తిరిగి అదే పరిస్థితి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా పారుపల్లి గ్రామానికి స్వర్ణ, పాముకుంట గ్రామానికి మమత, కల్వపల్లి కి భాను, లక్ష్మక్కపల్లి కి జ్యోతి, రాజపేటకు ఆర్.ఎం రెడ్డి, పుట్టగూడెం గ్రామానికి పవన్, రఘునాథపురం గ్రామానికి కొత్తగా సాగర్ లు బదిలీపై రాగా, సాగర్ కాకుండా మిగిలిన వారు రాజపేట మండలంలోని వేరే గ్రామ పంచాయతీల కార్యదర్శిగా ఇప్పటివరకు కొనసాగి తిరిగి ఇదే మండలంలో వేరే గ్రామాలను ఎన్నుకున్నారు. బదిలీలో పాల్గొనకుండా అదే గ్రామాలలో నమిల జమీల్, బసంతాపురం వెంకట్, రేణిగుంట వెంకటేష్ నాయక్, బేగంపేట దేవమని, నర్సాపురం లక్ష్మణ్, సోమారం మౌనిక, కుర్రారం పవన్ ( తుర్కపల్లి నుండి డిప్యూటేషన్ ), చల్లూరు మహేష్ (ఆలేరు నుండి డిప్యూటేషన్), దూదివెంకటాపురం గాంధీ, మల్లగూడెం చక్రి లు ఉన్నారు. కాగా మిగిలిన 5 గ్రామాలు అయిన సింగారం, కొత్తజాల, జాల, బూరుగుపల్లి, కొండ్రెడ్డి చెరువు గ్రామాలు పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో ఖాళీగా మిగిలిపోయాయి. కాగా ఇప్పటికే తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ నేరుగా ఎంపీడీవో కు పంచాయతీ కార్యదర్శులు ఇటీవల వినతి పత్రం అందజేసి తమ వెచ్చించిన డబ్బుల కోసం తిప్పలు పడుతుడ్డడంతో పరిస్థితులపై భయాందోళన చెందుతూ




కొత్తగా పంచాయతీ కార్యదర్శులు రాజపేట మండలానికి వచ్చేందుకు వేముకత చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు అవసరమని ఇతర గ్రామాలకు ఇన్చార్జీలు ఇవ్వకూడదని ఇటీవల మొరపెట్టుకొని బదిలీల ప్రక్రియలో తమ ఆశ నెరవేరుతుందనుకొని భంగపడ్డారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

**సిల్వర్ జూబ్లీతో చదువుకున్న పాఠశాలలో ఒక్కటైన స్నేహితులు....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం సంగిశెట్టి నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు 2000-2001 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత చదువుకున్న పాఠశాలలో కలిసి సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు చదువులమ్మ ఒడిలో కలిసి ఆనందంగా గడిపి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య నేర్పిన గురువులను ఆహ్వానించి మరోసారి ఆశీర్వాదం పొంది వారు నేర్పిన విద్య క్రమశిక్షణ గుర్తు చేసుకున్నారు. వారిని సత్కరించి కృతజ్ఞతలు చెప్పారు. ప్రస్తుతం పూర్వ విద్యార్థులు చేస్తున్న వృత్తిని తమ కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామన్నారు. సామూహికంగా భోజనాలు చేసిన అనంతరం సిల్వర్ జూబ్లీ బ్యాచ్ విద్యార్థులు పలు అంశాలు తీర్మానం చేసుకున్నారు.

# శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో భక్తి పారాయణం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శనివారం రాత్రి జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక సహస్ర పారాయణం చేపట్టారు. విష్ణు, లలిత సహస్ర పారాయణం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆలయంలోని దేవతామూర్తులకు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి గోత్రనామార్చన కార్యక్రమం చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. నంగునూరు జగదాంబ, బిర్రు భాగ్యలక్ష్మి, పెంట రజిత, పుష్పలత, చామకూర అరుణ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కళ్లెం బిక్షపతి సేవలు వెలకట్టలేనివి.....

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు కళ్లెం బిక్షపతి గౌడ్ అనారోగ్యం బారిన పడి ఆదివారం వేకువ జామున మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్నా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే కల్వపల్లి గ్రామానికి చేరుకున్నారు. మృత దేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాలవేసిన బీర్ల ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీకి గ్రామ ప్రజలకు బిక్షపతి గౌడ్ చేసిన సేవలను బీర్ల ఐలయ్య కొనియాడారు. పార్టీకి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వపల్లి గ్రామ సర్పంచి ఇంజలక్ష్మి, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాముకుంట సర్పంచ్ రంగా నరేష్ గౌడ్, చల్లూరు గ్రామ సర్పంచి భీమగాని రూప బాలనర్సయ్య, ఉప సర్పంచి బొంత సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోషల్ మీడియా కన్వీనర్ ఇంజ నరేష్, రఘునాథపురం మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, కాల్వపల్లి గ్రామ ఉప సర్పంచ్ కళ్లెం పాండుగౌడ్, గుంటి శ్రీనివాసు కల్వపల్లి గ్రామ మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :**
విదేశీ పర్యటనను దిగ్విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ కి చేరుకున్న రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ని ఆదివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల హరీష్ రావు కుమారుడు అర్చిష్మాన్ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు సైతం కలుసుకున్నారు.

# మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

**పద్మశాలి సంఘం డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు అధికారికంగా పెట్టాలని పద్మశాలి సంఘం నేతలు డిమాండ్ చేశారు. నిజాం పాలన, రజాకారులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును మెడికల్ కళాశాలకు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు వినతిపత్రం సమర్పించారు.ఆసిఫాబాద్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కూడా కోరారు. స్పందించిన ఆత్రం సుగుణక్క – కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, నామకరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవన నిర్మాణానికి అవసరమైన సహకారం అందేలా కూడా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఇరుకుల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, పట్టణ అధ్యక్షులు హనుమాన్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హంగీర్గా (కె) గ్రామంలో టీ.ఆర్.యస్ పార్టీ జెండా ఎగరేసిన ఖేడ్ నియోజకవర్గ ఇంచార్జ్


**బాపు మల్ శెట్టి, ఖేడ్ అబ్జర్వర్ శివశంకర్ పాటిల్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, నారాయణ ఖేడ్ :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మండలం మండలం హంగీర్గా (కె) గ్రామంలో తెలంగాణ రక్షణ సేన టీ ఆర్ యస్ పార్టీ వ్యవస్థాపకులు పార్టీ అధ్యక్షులు 20 నుండి జూన్ 2 తేదీ వరకు ప్రతిరోజు జెండా పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున జండా కార్యక్రమం చేయడం జరిగింది. తిరిగి వైద్యం శ్రీగ విద్య కవితమ్మ ఆదేశం మేరకు మే 20 నుండి జూన్ 20 తేదీ వరకు ప్రతి గ్రామంలో జెండా పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున జెండా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపు మల్ శెట్టి మరియు శివశంకర్ పాటిల్ మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినంక కవితమ్మ ముఖ్యమంత్రి అయినంక ఉచిత వైద్యం ఉచిత విద్య .రైతులకు ఉచిత మని కోరారు. కరెంట్ తెలంగాణ ఉద్యమకారులకు ఆదుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం . సంధాని భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, దిరాజ్, ప్రశాంత్,కిషన్ సింగ్, బాపు వైద్యనాథ్, బాశెట్టి సోమనాథ్, రామన్న,బండెప్ప, రామన్న, విట్టల్,శంకర్,చెన్నప్ప, శివకుమార్, మొతిరం, హరి సింగ్, రమేష్, పండరి, గాలెప్ప, గణపతి, తుకారం, అడెప్పా,సుభాష్, గురప్ప, దావీదు, రమేష్, సుక్కప్ప, సాయిలు, స్వామి దాస్, రాజు, నర్సింలు, ఏసప్ప భారీగా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో యువశక్తికి పెద్దపీట

**డోర్నకల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎం.డి. అశ్వకుద్దీన్ నియామకం**
**పదేళ్లుగా పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తకు గుర్తింపు**




**హైదరాబాద్ పల్స్, మే 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తోందని మరోసారి స్పష్టమైంది. డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు ఎం.డి. అశ్వకుద్దీన్‌ను నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జ్ భూక్య వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చాగంటి సందీప్ చేతుల మీదుగా అశ్వకుద్దీన్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశ్వకుద్దీన్ మాట్లాడుతూ.. డోర్నకల్ నియోజకవర్గంలో గత దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పని చేస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ విజయానికి తనవంతు కృషి చేశానని పేర్కొన్నారు. పార్టీ తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించడం గర్వకారణమన్నారు. యువతను కాంగ్రెస్ సిద్ధాంతాల వైపు తీసుకెళ్లే దిశగా మరింత చురుకుగా పనిచేస్తానని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో ముందుకు సాగుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ నాయక్, యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఉమా మురళీ నాయక్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పాక్ ఉగ్రవాదులతో లింక్..! మేడ్చల్‌లో యువకుడు అరెస్ట్..!!



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :
హోటల్ వెయిటర్ ముసుగులో నిరంతరం పాకిస్తాన్ ఉగ్రవాదులతో టచ్‌లో ఉంటూ మన దేశంలోని కొంతమంది ప్రముఖుల వివరాలను ఎప్పటికప్పుడు చేరవేస్తున్న యువకుడిని మేడ్చల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాహేద్ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మేడ్చల్‌కు వలసొచ్చాడు. స్థానికంగా ఉన్న ముబారక్ హోటల్‌లో వెయిటర్‌గా చేరాడు. అక్కడే నివాసం ఉంటున్నాడు. గత కొద్ది రోజులుగా జాహేద్ తన ఇన్‌స్టా గ్రాం ఖాతా ద్వారా.. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులతో సంభాషిస్తున్నాడు. పాక్ వస్తానని, ఉగ్రవాద శిక్షణలో పాల్గొంటానని వారిని కోరాడు. దీంతో జాహేద్‌కు ఉగ్రవాదులు కొన్ని పరీక్షలు కూడా పెట్టారు. అంతేకాదు కొంతమంది వీఐపీల సమాచారం కావాలని ఉగ్రవాదులు అడగడంతో.. వారికి షేర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.నిరంతరం జాహేద్ ఉగ్రవాదులకు సంబంధించిన వీడియోలు చూడడం, తుపాకులతో ఫొటోలు దిగడం.. వాటిని సోసల్ మీడియాలో షేర్ చేస్తూ ఉగ్రవాదానికి ఆకర్షితులైనట్లు పోలీసుల విచారణలో తేలింది. అతన్నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు రెండు బొమ్మ తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.మొత్తానికి ఈ కేసులో ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. జాహేద్ వ్యక్తిగత అంశాలపై లోతుగా విచారిస్తున్నారు. అతను సోషల్ మీడియాలో షేర్ చేసిన సమాచారంతో పాటు డిలీట్ చేసిన సమాచారం గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఓ ఉగ్రవాదితో జాహేద్ మాట్లాడిన అంశంపై ఆరా తీయగా, అతను టెర్రర్ కార్యకలాపాల్లో యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిసింది. జాహేద్‌ను మేడ్చల్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని లోతుగా విచారించే అవకాశం ఉంది.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియా చెందిన మల్లెపల్లి అంజలి ప్రస్తుతం ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజ్ వరంగల్ నందు కార్డియాలజీ(సి వి టి )మొదటి సంవత్సరం సంవత్సరంలో విడుదలైన ఫలితాలలో కాలేజీ స్థాయిలో మొదటి ర్యాంకును అలాగే రాష్ట్ర స్థాయి కాళోజి నారాయణరావు యూనివర్సిటీ స్థాయిలో తృతీయ ర్యాంకును సాధించినందుకు గాను నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ సభ్యులు గాడి పెల్లి వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ముందు ముందు కూడా ఇలాగే రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధించాలని మంచి పేరును గుర్తింపును తీసుకురావాలని అభినందించారు ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ సభ్యులు మాచర్ల శ్రీనివాస్, సోనులే రమేష్, మందాడే బిక్షపతి,గడ్డం లక్ష్మీ, సోనులే కవిత, దుర్గం సుజాత, మేక సాయి సంయుక్త. మందాడే అనసూర్య మరియు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జి కాట పై సొంత వదిన సంచలన ఆరోపణలు

**కాట కుటుంబ వివాదం సంచలనం:**



**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :**
పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్‌పై ఆయన వదిన కాట సునీత గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు.

**దాడి ఆరోపణ:**
ఆస్తి పంపకాల గురించి చర్చించేందుకు పిలిచాక, కాట రాజేష్ గౌడ్‌పై దాడి చేశారని సునీత పేర్కొన్నారు.

**ఫిర్యాదు:**
కుటుంబ సభ్యుల ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపిస్తూ రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పితృసంబంధం పై వివాదం: కథనంలో రాజేష్ గౌడ్‌ను తన కూతుర్ల తండ్రి కాదంటూ చెప్పడం హాస్యాస్పదమని సునీత మండిపడ్డారు.

**డిఎన్‌ఏ పరీక్షకు సిద్ధం:**
నిజానిజాలు తేల్చేందుకు డిఎన్ఏ పరీక్షకు సిద్ధంగా ఉంటానని ఆమె ప్రకటించారు.

**సవాల్:**
కాట శ్రీనివాస్ గౌడ్‌ను కట్ట మైసమ్మ దేవాలయానికి పసుపు బట్టలు ధరించి రావాలని సవాల్ విసిరారు.

# పారిగాంలో వడదెబ్బకు కూలి మృతి




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన కూలి ఏలేకర్ అశోక్ (40) వడదెబ్బకు మృతి చెందాడు. శనివారం పొలం పనికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన తర్వాత అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషిస్తున్న అశోక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలంగాణలో తీవ్రంగా వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో బహిరంగంగా పని చేసే కూలీలు, రైతులు మధ్యాహ్న వేళల్లో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అశోక్ మృతితో పారిగాం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# బేగంపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-2010 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. “స్నేహితుడిగా జీవించు -- స్నేహితుడని గర్వించు” అనే నినాదంతో నిర్వహించిన ఈ గెట్ టుగెదర్ పార్టీలో స్నేహబంధాలు మరింత బలపడ్డాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రోజుల అనుభవాలను పంచుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా కార్యక్రమాలు నిర్వహించారు. 16 ఏళ్ల స్నేహబంధాన్ని సెలబ్రేట్ చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పాల్గొన్న వారు తెలిపారు.

# మే 30 న మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ నమోదు సమావేశం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మే 30వ తేదీ న శనివారం ఉదయం 10 గంటలకు కేబీ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ భాగ్యనగర్ జ్ఞానేశ్వర్ మందిరంలో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర యూత్ కమిటీ, జిల్లా యూత్ కమిటీతో పాటు ఆసిఫాబాద్, సిర్పూర్-కాగజ్‌నగర్ డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, గ్రామ పటేళ్లు, మాలి సంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ కోరారు

# కరువు నేలలో 'బోడ కాకరకాయ' సాగు.. ఎకరాకు రూ. 7 లక్షలు సంపాదన

### పూర్తి వివరాలతో కూడిన

## ప్రత్యేక కథనం (స్పెషల్ స్టోరీ)




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, మహారాష్ట్ర :**
మహారాష్ట్రలోని ఫులంబ్రి ప్రాంతం అది. వానాకాలంలో ఆ ప్రాంతమంతా పచ్చగా కళకళలాడుతుంది. స్థానికంగా వర్షాకాలం సమయంలో బోడ కాకరకాయ విరివిగా పండుతుంది. అయితే ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆ కాకరకాయను తీసుకురావాలని తన తాత అడవికి పంపేవాడు.ఇక తన తాతకు బోడ కాకరకాయ ఎందుకు ఇష్టమో తెలుసుకోవాలని యువకుడు నిర్ణయించుకున్నాడు. ఎందుకు ఈ కూరగాయ మీకు ఇష్టమని అడిగినప్పుడు.. ప్రోటీన్ అధికంగా ఉంటుందని, విటమిన్లు కూడా పుష్కలంగా లభిస్తాయని తాత గారూ సమాధానం ఇచ్చారు. తాత మాటలు కృష్ణ ఫాల్కే మదిలో నాటుకుపోయాయి.ఆ చిన్ననాటి జ్ఞాపకమే కృష్ణను బోడ కాకరకాయ సాగుపై దృష్టి సారించేలా చేసింది. తనకున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి.. బోడ కాకరకాయ సాగుకు పూనుకున్నాడు. 2018లో ఈ సాగు ప్రారంభించాడు. ఇప్పుడు ఎకరానికి దాదాపు రూ. 7 లక్షల సంపాదిస్తూ.. ఖర్చులు పోనూ రూ. 6.25 లక్షల వరకు ఆర్జిస్తున్నాడు. కృష్ణను ప్రేరణగా తీసుకుని 675 మంది రైతులు బోడ కాకర సాగును ప్రారంభించారు.

**2016లో ఉద్యోగానికి రాజీనామా..**
కృష్ణ 2015లో బీఎస్సీ అగ్రికల్చర్ పట్టా పుచ్చుకున్నాడు. ఆ తర్వాత యూపీఎల్ ఇండియా కంపెనీలో చేరాడు. దాదాపు ఏడాది కాలం పాటు ఉద్యోగం చేశారు. కానీ ఆ కార్పొరేట్ ఉద్యోగం అతనికి నచ్చలేదు. పని భారం ఎక్కువగా ఉండడంతో మానసికంగా ఇబ్బందిపడేవాడు. ఇదే కష్టం తన పొలంలో చేస్తే.. అంతకు అంత లాభాలు గడించొచ్చని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 2016లో తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఇంటికి తిరిగొచ్చి పొలం బాట పట్టాడు.

**బోడ కాకరకాయకున్న డిమాండ్‌తో..**
2016లో తన కుటుంబానికి కేవలం 2.5 ఎకరాల భూమి మాత్రమే ఉండేది. ఇక ఆ భూమిలో 2017లో మిరప సాగు చేపట్టి లాభాలు గడించాడు. కానీ మనసు మాత్రం బోడ కాకరకాయ మీదనే ఉంది. స్థానికంగా ఉన్న గిరిజనులు జాతీయ రహదారులపై బోడ కాకరకాయలను అధిక ధరలకు విక్రయించడం కూడా కృష్ణ గ్రహించాడు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే ప్రతి ఒక్కరూ వర్షాకాలంలో ఈ కాకరకాయను ఇష్టంగా తింటారని కనుగొన్నాడు. అందుకే దీనికి అధిక డిమాండ్ ఉందన్న విషయాన్ని గ్రహించాడు. రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది కాబట్టి డయాబెటిక్ రోగులు కూడా ఇష్టంగా తింటారు.

**అడవుల నుంచి విత్తనాలు సేకరించి..**
ఈ క్రమంలో మొత్తానికి కృష్ణ తన వ్యవసాయ పొలంలో బోడ కాకరకాయ సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే ఆలస్యం.. ఇక అడవుల్లోకి వెళ్లి బోడ కాకరకాయ విత్తనాలను సేకరించాడు. 2018లో విత్తనాలు సేకరించి భద్రపరిచాడు. 2019లో సాగు మొదలుపెట్టాడు.

**రెండు నెలల వ్యవధిలోనే దిగుబడి..**
అయితే మరాత్వాడా కరువు పీడిత ప్రాంతం కాబట్టి.. తేమను కాపాడుకోవడానికి కాకర మొక్కలను దగ్గరగా నాటాడు. ఒక్కో మధ్య 4 అడుగుల దూరం, వరుసల మధ్య 3 అడుగుల దూరం ఉండేలా ప్లాన్ చేసుకున్నాడు. అర ఎకరా పొలంలో 600 నుంచి 700 గ్రాముల వరకు విత్తనాలు నాటాడు. ఇది తీగ జాతి పంట కావడంతో.. 15 -20 అడుగుల దూరంలో ఏడు అడుగుల ఎత్తులో వెదురు కర్రలను పాతాడు. తీగలు కర్రలపైకి పాకి.. పొదరిల్లు మాదిరి రూపాంతరం చెందుతుంది. అయితే మే నెలలో విత్తనాలు నాటగా.. రెండు నెలల వ్యవధిలోనే దిగుబడి రావడం మొదలైంది. జూన్ నెలఖారు నాటికి కోతకు వచ్చింది కాకరకాయ. ఇలా సెప్టెంబర్ మాసం వరకు ఈ పంటను కొనసాగింపు చేయొచ్చు.

**ఎకరానికి 4.5 టన్నుల దిగుబడి.. రూ. 7 లక్షల ఆదాయం..**
మొదటి సీజన్‌లో కేవలం అర ఎకరం నుంచి సుమారు 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ కాకరకాయలను ఛత్రపతి సంభాజీనగర్ మార్కెట్‌లో కిలోకు రూ. 180 చొప్పున విక్రయించాడు కృష్ణ. అయితే వినియోగదారుల నుంచి అనూహ్యమైన స్పందన రావడంతో.. దీనికి మార్కెట్‌లో భారీగానే డిమాండ్ ఉందన్న విషయాన్ని కృష్ణ గ్రహించాడు. అలా రెండు ఎకరాల్లో పంటను సాగు చేస్తూ ప్రతి ఏడాది ఎకరానికి దాదాపు 4 నుంచి 4.5 టన్నుల వరకు దిగుబడిని సాధిస్తున్నాడు. అయితే జూన్ మాసంలో కిలో కాకరకాయలను రూ. 280 వరకు విక్రయించాడు కృష్ణ. వర్షాకాలం ముగిసే సమయం నాటికి ఆ ధర రూ. 140 నుంచి రూ. 170కి తగ్గుతుంది. ఇలా ఏడాదికి రూ. 7 లక్షల రాబడిని పొందుతున్నాడు కృష్ణ. నీటి అవసరం కూడా తక్కువే. మొత్తంగా ఎకరానికి పెట్టుబడి కింద రూ. 70 వేల నుంచి రూ. 80 వేల ఖర్చు అవుతుందని కృష్ణ తెలిపాడు.

**అదనంగా రూ. 50 వేల ఆదాయం..**
అయితే ఈ మొక్కలు అక్టోబర్ నెల వరకు దిగుబడిని ఇస్తాయి. ఆ తర్వాత తీగలు వాటంతట అవే ఎండిపోతాయి. ఆ వేర్లు మట్టిలోనే కలిసిపోతాయి. మళ్లీ ఏప్రిల్ నాటికి కొత్త చిగురు వస్తుంది.. మళ్లీ సహజంగా పెరుగుతాయి మొక్కలు. ఒక్కో తీగ ఏడు నుంచి ఎనిమిది ఏండ్ల వరకు పునరుత్పత్తి సాధిస్తుంది. ఇక ఇదే భూమిలో అక్టోబర్ నుంచి మొక్కజొన్న, శనగలను పండిస్తున్నాడు. ఈ పంటల వల్ల అదనంగా ఎకరానికి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నాడు కృష్ణ.

**675 మంది రైతులు కృష్ణ బాటలోనే..**
స్థానికంగా ఉన్న 675 మంది కృష్ణ బాటలోనే పయనిస్తున్నారు. బోడ కాకరకాయకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో.. రైతులందరూ ఈ సాగుపై దృష్టి పెట్టారు. కృష్ణ దగ్గర మెళవకులు నేర్చుకుని.. దిగుబడి సాధిస్తున్నారు. చాలా వరకు కృష్ణ పండించిన పంటను పొలం దగ్గరే కొనుగోలు చేస్తున్నారు. మిగిలితే ఛత్రపతి శంభాజీ నగర్ మండికి తరలించి విక్రయిస్తుంటామని కృష్ణ తెలిపాడు. భాందర, నాగ్‌పూర్, యావత్మల్, గోధానా, జలగావ్ వంటి ప్రాంతాల్లో బోడ కాకర సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపాడు. విత్తనాలతో పాటు మొక్కలను కూడా రైతులకు ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నాడు.

**కరువు పీడిత ప్రాంతంలో వందలాది రైతులకు మేలు..**
అడవిలో లభించే బోడ కాకరకాయను సాగు చేసి లాభాలు గడించి తన అదృష్టాన్ని మార్చుకోవడంతో పాటు కరువు పీడిత ప్రాంతమైన మరాత్వాడాలో వందలాది మంది రైతులకు కొత్త మార్గాన్ని చూపించి.. ఆదాయాన్ని సృష్టించుకునే అవకాశం కల్పించాడు కృష్ణ.

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి

# మోదీ ఓ చాన్స్ ఇచ్చారు.!... ఎంపీ ధర్వపురం అర్విండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24,**
తెలంగాణ బీజేపీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర మంత్రివర్గం- పార్టీలో మార్పుల దిశగా కసరత్తు జరుగుతోంది. తెలంగాణ నుంచి ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మార్పులు- చేర్పులు ఉంటాయని అంచనాలు ఉన్నాయి. ఇదే సమయంలో తెలంగాణ బీజేపీలో కోల్డ్ వార్ చర్చనీయాంశంగా మారింది. తాజా పరిస్థితుల వేళ బీజేపీ ఎంపీ ధర్వపురం అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కరంగా మారాయి.బీజపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఒక టీవీ ఛానల్ కు ఇచ్చిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రధాని మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మోదీ ఓ చాన్స్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. మోదీ ప్రతిపాదన విషయంలో.. భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చని పేర్కొన్నారు. సువేందు అధికారి, ఏక్‌నాథ్ షిండేలాగే రేవంత్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చారేమో.. అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడం తమ పార్టీ తప్పేనని, ప్రజలు తమను కోరుకోలేదన్నది నిజమని స్పష్టంచేశారు. రాష్ట్రం లో పెద్ద గ్రూప్ లీడర్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని అభిప్రాయపడ్డారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో వివాదంపై స్పందిస్తూ.. పార్టీలో అభిప్రాయ భేదాలు ఉంటాయని, అయితే తాను ఎవరిపై ఫిర్యాదులు చేయలేదని తెలిపారు.రాష్ట్రంలో బీజేపీకి స్థానికంగా ఎలాంటి సీఎం ముఖం అవసరం లేదని, ప్రధాని నరేంద్ర మోదీయే తమ పార్టీకి అసలైన ముఖమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను ఉన్న విషయాన్ని అరవింద్ ఓపెన్‌గా ఒప్పుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవిని తాను అడిగిన మాట వాస్తవమే, కానీ అది తనకు దక్కలేదని చెప్పారు. అధిష్ఠానం తనను రెండో పేరు చెప్పమంటే.. తాను బండి సంజయ్ పేరు సూచించినట్లు అరవింద్ వెల్లడించారు. ఒకవేళ తనను అధ్యక్షుడిగా నియమిస్తే పార్టీకి మరింత ప్లస్ అయ్యేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూనే.. పదవుల కోసం తనకు ఎలాంటి ఆరాటం లేదన్నారు. ఏమి ఇస్తారో, ఏమి ఇయ్యరో తన చేతిలో లేదని.. తన తండ్రికి కూడా సీఎం కావాలనే కోరిక ఎప్పుడూ లేదు, ఆయనకు పార్టీ ప్రెసిడెంట్ పదవి పైనే ఆసక్తి ఉండేదని వివరించారు. 49 ఏళ్ల వయసులో తనకు ఎలాంటి వ్యక్తిగత కోరికలు లేవు, ఏ బాధ్యత ఇచ్చినా ప్యాషన్‌తో చేస్తానని అర్వింద్ చెప్పుకొచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సగం క్యాబినెట్‌లో క్వాలిటీ కాంగ్రెస్ లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర పనిచేసేందుకు మంత్రులే ఇష్టపడటం లేదని, తెలంగాణలో వామపక్ష భావజాలం లేదని అరవింద్ అభిప్రాయపడ్డారు.

### ఫాల్టాలో బీజేపీ 'ప్రచండ' విజయం..

# 'డైమండ్ హార్బర్' కోటలో మమతకు బిగ్ షాక్!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కలకత్తా:**
పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా ఫల్తా అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా కైవసం చేసుకున్నారు. గతంలో టీఎంసీ ఆధీనంలో ఉన్న ఈ సీటులో, ఎన్నికల అక్రమాల కారణంగా తిరిగి పోలింగ్ నిర్వహించగా.. బీజేపీ దాదాపు లక్ష ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఇది పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా పరిగణించబడుతోంది.ఏప్రిల్ 29న ఈ స్థానంలో మొదటిసారి పోలింగ్ జరిగింది. అయితే, ఓటింగ్ సమయంలో ఈవీఎంలలో అక్రమాలు, బూత్‌ల కైవసం, ఓటర్లను బెదిరించడం వంటి తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, ఎన్నికల సంఘం మొత్తం ప్రాంతంలో పోలింగ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఫలితంగా, మే 21న ఎన్నికల సంఘం అన్ని 285 బూత్‌లలో తిరిగి పోలింగ్ నిర్వహించింది. ఈసారి భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దీని ఫలితంగా పోలింగ్ ప్రశాంతంగా సాగింది, 88 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.రీ- పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 24న పూర్తయింది. మొదటి నుంచి బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఆధిక్యంలో కొనసాగారు. రౌండ్లు గడిచే కొద్దీ ఆయన ఆధిక్యం పెరుగుతూ పోయింది, స్పష్టమైన విజయం వైపు సాగారు. విజేత దేబాంగ్షు పాండాకు మొత్తం 1,49,666 ఓట్లు లభించాయి. రెండో స్థానంలో సీపీఎం అభ్యర్థి శంభు నాథ్ కుర్మీ నిలిచారు, ఆయనకు 40,645 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్ మొల్లా 10,084 ఓట్లతో ఉన్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ కేవలం 7,783 ఓట్లతో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. తిరిగి పోలింగ్‌కు ముందే ఆయన పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకోవడం గమనార్హం.ఈ ఫలితాలపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. "మరోసారి ఓట్లు దొంగిలించబడ్డాయి" అని ఆమె అన్నారు. కేంద్ర బలగాలు బీజేపీ ఏజెంట్లుగా లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించాయని కూడా ఆమె ఆరోపించారు. మరోవైపు, బీజేపీ విజయం తర్వాత ముఖ్యమంత్రి సువేందు అధికారి తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "డైమండ్ హార్బర్ మోడల్ ఇప్పుడు 'తృణమూల్ లాస్ మోడల్'గా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఫాల్టా ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండాను భారీ మెజారిటీతో గెలిపించినందుకు అభినందించారు. ఒక లక్ష ఓట్ల తేడాతో గెలవాలని ప్రజలను కోరానని, విజయం 1 లక్షా 8 వేల ఓట్లకు పైగా ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి ద్వారా ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుని 'గోల్డెన్ ఫల్తా'ను నిర్మిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.ఈ విజయం బీజేపీకి అత్యంత కీలకమైనది. గతంలో టీఎంసీ కంచుకోటగా, ఆ పార్టీ కీలక నాయకుడు అభిషేక్ బెనర్జీ డైమండ్ హార్బర్ లోక్‌సభ నియోజకవర్గంలో భాగంగా భావించే ఈ స్థానంలో బీజేపీ ఇంతటి భారీ మెజారిటీతో గెలవడం, మమతా బెనర్జీకి పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక బలమైన సందేశాన్ని పంపింది.

# కేంద్రం ప్రజలకు 'స్లో పాయిజన్' ఇస్తోంది.. కేజ్రీవాల్ సంచలనం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, సెంట్రల్ డెస్క్:
ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. చమురు, గ్యాస్ రవాణా నిలిచిపోయింది. దాంతో ప్రపంచ దేశాలతోపాటు భారత్ లోనూ ఇరాన్- అమెరికా యుద్ధ సెగలు తాకుతున్నాయి. అయితే వారం రోజుల వ్యవధిలోనే చమురు సంస్థలు మూడు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. అయితే దేశంలో వరుసగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, ఎల్ పీజీ ధరలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వీడియో పోస్ట్ చేశారు.గత 10 నుంచి 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మూడుసార్లు పెంచిందని కేజ్రీవాల్ విమర్శించారు. ఈ విధంగా ప్రతిరోజూ ధరలను పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్లో పాయిజన్ ఇస్తోందని ఆయన కీలక ఆరోపణలు చేశారు. గత రెండు వారాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ కు రూ. 4 నుంచి రూ.5 వరకు పెరిగాయని.. గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ధర రూ. 150 కు చేరుకుంటుందనే పుకార్ల వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనల్లో, షాక్ లో ఉన్నారని దీనిపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని దుయ్యబట్టారు.రష్యా, ఇరాన్ దేశాలు భారత్ కు తక్కువ ధరకే ముడి చమురు, గ్యాస్ అందించడానికి సిద్ధంగా ఉన్నాయని.. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తోందని కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. కేంద్రం ఎందుకు ఈ ప్రతిపాదనలను తిరస్కరిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ధరల పెరుగుదలే కాకుండా దేశంలోని పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఏర్పడిందని కేజ్రీవాల్ ఆరోపించారు. గుజరాత్ లో డీజిల్ కోసం పెట్రోల్ పంపుల వద్ద ట్రాక్టర్ల సుదీర్ఘ క్యూలు ఉన్నాయని.. ఉత్తర్ ప్రదేశ్ లోని గోరఖ్ పూర్, మహారాష్ట్ర లోని అకోలా, బుల్దానా వంటి ప్రాంతాల్లో కూడా ఇంధనం, గ్యాస్ కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ మేరకు కొన్ని వీడియో క్లిప్ లను కేజ్రీవాల్ రిలీజ్ చేశారు.ఈ దేశం ఏ రాజకీయ నాయకుడిదో లేక ఏ పార్టీదో కాదని 140 కోట్ల మంది ప్రజలదని కేజ్రీవాల్ తెలిపారు. రష్యా, ఇరాన్ ల నుంచి భారత్ తక్కువ ధరకు చమురు కొనుగోలు చేయాలా..? వద్దా..? అనే అంశంపై ప్రజలందరూ తమ అభిప్రాయాలను పంచుకోవాలని ప్రజలకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.

# రోహింగ్యాలకు బెంగాల్ సీఎం సువేందు భారీ షాక్



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కలకత్తా:
పశ్చిమ బెంగాల్ లో అధికార మార్పిడి అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీకి వరుస షాకులను ఇస్తోందక్కడి ముఖ్యమంత్రి సువేందు అధికారి సారథ్యంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం. ఇప్పటికే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయక్కడ. వ్యతిరేకంగా ప్రచారం చేసిన సెలెబ్రెటీలను కూడా వదలట్లేదు. కేసులు నమోదవుతున్నాయి.ఈ పరిణామాల మధ్య పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరుల డిపోర్టేషన్ చేపట్టింది. రాష్ట్రంలో నివసిస్తోన్న రోహింగ్యా శరణార్థులను స్వదేశాలకు పంపడానికి ఏర్పాట్లు చేపట్టింది. అక్రమంగా నివసిస్తోన్న బంగ్లాదేశీయులను కూడా వారి దేశానికి పంపించనుంది. దీనికోసం రాష్ట్రంలో ప్రత్యేక హోల్డింగ్ కేంద్రాలను నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది.ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు లిఖితపూర్వక ఆదేశాలు అందాయి. హోల్డింగ్ సెంటర్ల నిర్మాణం, వారి డిపోర్టేషన్ కు సంబంధించిన, మార్గదర్శకాలు సైతం ఇందులో ఉన్నాయి. అన్ని జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలో ఈ కేంద్రాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి, పనులను త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. వారందరినీ కూడా హోల్డింగ్ సెంటర్లకు తరలించాలి. చిట్టచివరి వ్యక్తం కూడా హోల్డింగ్ సెంటర్ కు చేరిన తర్వాత స్వదేశానికి పంపించాలని ఆదేశించింది ప్రభుత్వం.అక్రమ వలసదారులు ఎక్కువగా ఉండే బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ హోల్డింగ్ కేంద్రాల ముఖ్య లక్ష్యం అక్రమంగా నివసిస్తున్న వారిపై కఠిన నిఘా ఉంచడమే. అక్రమ బంగ్లాదేశీయులు, రోహింగ్యా చొరబాటుదారులను నేరుగా జైలులో కాకుండా ఈ ప్రత్యేక కేంద్రాలకు తరలిస్తారు. వారి గుర్తింపు నిర్ధారణ, స్వదేశాలకు చట్టబద్ధంగా తిరిగి పంపే ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇక్కడే పర్యవేక్షణలో ఉంచుతారు.తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అక్రమ చొరబాటుదారులందరినీ కూడా స్వదేశానికి పంపిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చింది బీజేపీ. దీనికి అనుగుణంగా అక్కడి బీజేపీ ప్రభుత్వం తాజా చర్యలు చేపట్టింది. ఈ డిపోర్టేషన్ చర్యలన్నింటినీ కూడా కేంద్ర హోం, విదేశాంగ మంత్రిత్వ శాఖలు పర్యవేక్షించే అవకాశం ఉంది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీని నెరవేర్చడంలో నిమగ్నమైంది.

# లిఫ్ట్ ఇస్తామని నమ్మించి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్ట్: కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

**కారు కిరాయికి తీసుకొని దొంగతనాలు పాల్పడుతున్న యువత అరెస్ట్**
**మైనర్ అని తెలిసి కారు కిరాయికి ఇచ్చిన యజమాని పైన కేసు నమోదు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, సిద్దిపేట జిల్లా : రాజీవ్ రహదారిపై ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి దోపిడీకి పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గౌరారం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుండి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు.

**కేసు వివరాలు:**
ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శశి రంజన్ సింగ్ (24) బషీర్‌బాగ్‌లో నివసిస్తూ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22న రాత్రి 12:20 గంటల ప్రాంతంలో ఆయన పాతూరులోని బేయర్స్ క్రాప్ సైన్స్ కంపెనీలో పని ముగించుకుని, సికింద్రాబాద్ వెళ్లేందుకు ప్రజ్ఞాపూర్ బస్ స్టాప్ వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో సిద్దిపేటకు చెందిన ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్ (25) తన ముగ్గురు మైనర్ సహచరులతో కలిసి ఎనసానపల్లికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద టి.ఎస్ 08 జి.డబ్ల్యూ 8840 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారును సెల్ఫ్ డ్రైవింగ్‌కు కిరాయికి తీసుకుని దొంగతనం కోసం తిరుగుతున్నారు. బస్ స్టాప్ వద్ద ఒంటరిగా ఉన్న శశి రంజన్ సింగ్‌ను గమనించి, తాము కూడా సికింద్రాబాద్ వైపు వెళ్తున్నామని నమ్మబలికి కారు ఎక్కించుకున్నారు.కారు కొంతదూరం వెళ్లిన తర్వాత గౌరారం గ్రామ శివారులోని ముట్రాజ్ పల్లి చౌరస్తా వద్ద రాజీవ్ రహదారి పక్కన ఆపారు. బాధితుడిని బెదిరించి అతని వద్ద ఉన్న బ్యాగు, రూ. 200 నగదు, మరియు వివో మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కుని, అతడిని కారులోంచి కిందకు నెట్టేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు – నిందితుల అరెస్ట్:**
సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐ రవి రాజు పర్యవేక్షణలో గౌరారం ఎస్సై ఆరోగ్యం, సిబ్బంది మహేందర్ రెడ్డి, విష్ణు చందర్, పర్శరాములులతో కూడిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది.రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి కారు నంబర్ ఆధారంగా ఎన్సాన్ పల్లికి చెందిన యజమాని రాజును విచారించారు. నిబంధనలకు విరుద్ధంగా, మైనర్లను గమనించకుండా రోజుకు రూ. 3,500 చొప్పున ఆశపడి కారును కిరాయికి ఇచ్చినట్లు అతడు అంగీకరించాడు.

**నిందితుల పట్టుబడుట:**
సాంకేతిక పరిజ్ఞానం, ఫోన్ నంబర్ల ఆధారంగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**నిందితుల నేరచరిత్ర:**
ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్‌పై గతంలో సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రాత్రి వేళల్లో దొంగతనాల కేసులు ఉన్నాయి. అలాగే రెండవ నిందితుడైన (మైనర్) పై గతంలో పోక్సో కేసు ఉన్నట్లు విచారణలో తేలింది

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**
నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కార్




బాధితుడి బ్యాగ్, రూ. 200 నగదు
బాధితుడి వివో మొబైల్ ఫోన్
నిందితులు వాడిన 3 మొబైల్ ఫోన్లు

ప్రధాన నిందితుడు వొలుసుల అలీఖేష్‌ను రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు బాల నేరస్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు, నేర చరిత్ర గలవారికి కారును కిరాయికి ఇచ్చిన కారు యాజమాని రాజుపై కూడా మోటార్ వాహనాల చట్టం కింద కేసు నమోదు చేశారు.సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, వాహనాలను కిరాయికి ఇచ్చే యజమానులు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వాహనం తీసుకునే వారి గుర్తింపు పత్రాలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ క్షుణ్ణంగా పరిశీలించి, నమ్మకస్థులైన వారికే వాహనాలు ఇవ్వాలి. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు, అపరిచితులకు వాహనాలు ఇస్తే వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు హెచ్చరించారు.

# పాక్ సైనికుల రైలుపై ఆత్మాహుతి దాడి.. 38 మంది మృతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :**
పాకిస్థాన్‌లోని అల్లర్ల ప్రభావిత ప్రాంతమైన బలూచిస్థాన్‌లో ఆదివారం ఘోర ఉగ్రదాడి చోటుచేసుకుంది. క్వెట్టాలోని చమన్ ఫటక్ సమీపంలో సైనికులు ప్రయాణిస్తున్న ఓ రైలును పేలుడు పదార్థాలతో ఉన్న కారుతో ఢీకొట్టారు. ఈ ఆత్మాహుతి (సూసైడ్) దాడిలో కనీసం 38 మంది మృత్యువాత పడగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులే ఉన్నారు. మంగళవారం రాబోయే ఈద్ పండుగను తమ సొంతూళ్లలో జరుపుకునేందుకు వీరంతా జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులో పెషావర్ వెళ్తుండగా ఈ దారుణం జరిగింది.

**భారీ పేలుడు.. చెలరేగిన మంటలు:**
పేలుడు ధాటికి రెండు రైలు బోగీలు పట్టాలు తప్పి బోల్తా పడ్డాయి. వెంటనే వాటిల్లో మంటలు చెలరేగాయి. దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకుంది. ఘటనా స్థలంలో ఎటు చూసినా చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు, రక్తపు మడుగులో ఉన్న క్షతగాత్రులే కనిపించారు. భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపట్టి, బాధితులను స్ట్రెచర్ల మీద ఆసుపత్రులకు తరలించాయి. పేలుడు తీవ్రతకు రైల్వే ట్రాక్‌కు 25–30 మీటర్ల దూరంలో పార్క్ చేసిన కార్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. పక్కనే ఉన్న ఒక బహుళ అంతస్తుల భవనం అద్దాలు పగిలి, గోడలు కూలిపోయి తీవ్రంగా దెబ్బతింది.

దాడికి బాధ్యత మాదే: బీఎల్‌ఏ ప్రకటన
ఈ దారుణ మారణకాండకు తామే బాధ్యులమని బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. తమ గ్రూప్‌నకు చెందిన 'మజీద్ బ్రిగేడ్' అనే ఆత్మాహుతి దళం ఈ ఫిదాయీ దాడిని పక్కా ప్లాన్‌తో అమలు చేసిందని వెల్లడించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను, ప్రాణ నష్టం వివరాలను త్వరలోనే మీడియాకు విడుదల చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది.
ఈ దాడిని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. ఇదొక పిరికిపంద చర్య అని మండిపడ్డారు.



**బలూచిస్థాన్‌లో అసలేం జరుగుతోంది?**
ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులను పంచుకునే బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధానే ఈ క్వెట్టా. ఇక్కడ దశాబ్దాలుగా అలజడులు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. తమ ప్రాంతానికి స్వయంప్రతిపత్తితో పాటు, సహజ వనరుల్లో తమకు ఎక్కువ వాటా కావాలని స్థానిక బలూచ్ వేర్పాటువాదులు పాక్ ప్రభుత్వంతో పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే బీఎల్‌ఏ వంటి గ్రూపులు పాక్ భద్రతా బలగాలతో పాటు, చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకుని తరచుగా దాడులకు పాల్పడుతున్నాయి.

## 9 వేళ ఏళ్ల నాటి 'ప్రేతాత్మల' రహదారి!

# కాలం దాచిన అడుగుజాడలు..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :**
మీరు నడుస్తున్న దారి కింద.. సరిగ్గా మీ అడుగులు పడుతున్న చోటే, తొమ్మిది వేల సంవత్సరాల క్రితం ఒక ఆదిమానవుడు చెప్పులు లేకుండా నడిచాడని తెలిస్తే? మీ పాదముద్ర పడిన చోటే, ఒకప్పుడు భారీ ఆకారపు అడవి మృగాలు, తోడేళ్లు సంచరించాయని తెలిస్తే? వినడానికే ఒళ్లు గగుర్పొడిచే ఈ అద్భుతం ఇంగ్లాండ్‌లోని ఫార్మ్‌బీ తీరంలో నిజమైంది! కాల గమనంలో, ఇసుక పొరల కింద దాగివున్న వేలాది సంవత్సరాల నాటి 'చరిత్రపూర్వ రహదారి' ఇప్పుడు బయటపడింది. సముద్రపు అలల ఉధృతికి, తీరకోత కారణంగా పైనున్న బురద పొరలు తొలగిపోవడంతో.. కాలం గడ్డకట్టేసిన ఒక వింత ప్రపంచం శాస్త్రవేత్తల కళ్లముందు సాక్షాత్కరించింది.దాదాపు రెండు మైళ్ల మేర విస్తరించి ఉన్న ఈ తీర ప్రాంతంలో ఒకటో రెండో కాదు.. ఏకంగా వేలాది పురాతన పాదముద్రలు లభ్యమయ్యాయి. మన పూర్వీకులైన ఆదిమానవులు, అంతరించిపోయిన అడవి జంతువులు ఒకే దారిలో, ఒకరి పక్కన ఒకరు నడిచిన అరుదైన సహజీవన దృశ్యాన్ని ఈ అడుగుజాడలు పట్టిచూపుతున్నాయి. 'నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ సరికొత్త అధ్యయనం అంతర్జాతీయంగా శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేస్తోంది.

**మంచు యుగం ముగింపు.. ఒకే దారిలోకి జీవరాశి!**
ఈ అడుగుజాడల వెనుక ఒక భారీ పర్యావరణ పరిణామం దాగి ఉంది. గత మంచుయుగం ముగింపు దశకు వచ్చినప్పుడు భారీ హిమానీనదాలు కరిగి, సముద్ర మట్టాలు విపరీతంగా పెరిగాయి. ఈ పర్యావరణ ఒత్తిడి కారణంగా అడవుల్లో ఉన్న వన్యప్రాణులు, తీరంలో ఉన్న మానవులు తమ మనుగడ కోసం క్రమంగా లోపలి భూభాగాల్లోకి తరలిరావాల్సి వచ్చింది. అలా అందరినీ ప్రకృతి ఒకే చోటకు చేర్చింది. ఈ క్రమంలో ఏర్పడిన రద్దీ తీరప్రాంత పర్యావరణ వ్యవస్థే ఈ 'ఫార్మ్‌బీ' తీరం.ఈ అధ్యయన ప్రధాన రచయిత్రి అలిసన్ బర్న్స్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతం గతంలోని ఒక అద్భుతమైన చిత్రాన్ని మన కళ్లముందు ఉంచుతుంది. ఇక్కడి ఇసుక దిబ్బల కింద సుమారు 36 వేర్వేరు పాదముద్రల పొరలతో కూడిన ఒక భారీ భౌగోళిక





నిధి దాగి ఉంది. మధ్యరాతియుగం నుండి మధ్యయుగం వరకు వేర్వేరు కాలాల్లో నడిచిన మనుషుల అడుగుజాడలు ఒకదానిపై ఒకటి పొరలుగా ఏర్పడి కాలక్రమాన్ని రికార్డు చేశాయి. పరిశోధకులు రేడియోకార్బన్ డేటింగ్ ద్వారా బురదలో చిక్కుకున్న పురాతన వృక్ష బీజాలను (ఆల్డర్, బిర్చ్, స్ప్రూస్) పరీక్షించగా.. ఈ తీరం సుమారు క్రీస్తు పూర్వం 15,000 (15,000 బిసిఇ) నుండి క్రీస్తు శకం 1450 (1450 ౘాఙ) వరకు నిరంతరం వినియోగంలో ఉన్న రహదారి అని తేలింది.

**తోడేళ్లు, ఆదిమానవుల సహజీవనం!**
ప్రపంచవ్యాప్తంగా లభించే పురాతన పాదముద్రలు కేవలం మానవులకో లేదా ఏదైనా ఒక జంతువుకో సంబంధించినవిగా ఉంటాయి. కానీ, ఫార్మ్‌బీ తీరం మాత్రం పూర్తి స్థాయి పర్యావరణ వ్యవస్థను చూపుతోంది. ఇక్కడి బురదలో శతాబ్దాల క్రితం అంతరించిపోయిన భారీ అడవి పశువులైన 'ఔరోచ్‌లు', గొప్ప రెడ్ డీర్‌లు, శక్తివంతమైన అడవి పందులు, క్రేన్‌ల వంటి పక్షుల అడుగుజాడలు స్పష్టంగా ఉన్నాయి. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. భయంకరమైన గ్రే తోడేళ్లు, పిల్లి జాతికి చెందిన క్రూరమృగం 'లింక్స్' పాదముద్రలపైనే మానవ పాదముద్రలు కూడా కలిసిపోయి ఉన్నాయి. అంటే, నాటి మానవులు ఈ క్రూరమృగాలతో కలిసి ఒకే దారిని, వనరులను పంచుకుంటూ సర్దుబాటు చేసుకుని బతికారని దీని ద్వారా స్పష్టమవుతోంది.

**పశువుల అడుగులని కొట్టేసారు.. కానీ!**
నిజానికి ఈ పాదముద్రలు దశాబ్దాలుగా అక్కడి ప్రజల కళ్లముందే ఉన్నాయి. 1970లలో స్థానిక బీచ్‌కోంబర్‌లు వీటిని కనుగొన్నప్పటికీ, ఆధునిక కాలంలోని ఆవులు, పశువుల అడుగుజాడలుగా భావించి కొట్టిపారేశారు. కానీ, 1990లలో ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈ ముద్రలను నిశితంగా పరిశీలించి, పరిశోధనలు చేయడంతోనే ఈ ప్రాంతం యొక్క అసలు వయస్సు, చరిత్ర ప్రపంచానికి తెలిసింది. ఇక్కడి పైపొరలు చాలా సున్నితంగా ఉండటం వల్ల ఒక బలమైన తుఫాను వస్తే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కానీ, లోతైన బురదలో గాలి సోకకుండా పూడిపోయిన అడుగుజాడలు మాత్రం వేల సంవత్సరాలైనా చెక్కుచెదరకుండా భద్రంగా ఉన్నాయి.ప్రకృతి నుంచి మనిషి విడిపోయి బతకడం అనేది ఇటీవలి కాలంలో వచ్చిన మార్పు మాత్రమేనని.. మానవ చరిత్రలో అత్యధిక భాగం మన దైనందిన అడుగులు అడవి జంతువుల, వన్యప్రాణుల ప్రపంచపు లయలలో భాగంగానే సాగాయని ఈ వెయ్యేళ్ల నాటి అడుగుజాడల రహదారి మనకు గుర్తుచేస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**ఎమ్మెల్సీ దండే విఠల్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** జూన్ 1న సీఎం రేవంత్ రెడ్డి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడత ప్రారంభంతో పాటు పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ విజ్ఞప్తి చేశారు.చింతలమనేపల్లి మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి సభ విజయవంతానికి వ్యూహరచన చేశారు.

# రాజపేట మండలనికి "ఏడు"మహిళా సంఘ భవనాలు మంజూరు...

**బీర్ల ఐలయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నమిల మహేందర్ గౌడ్**


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో 7 గ్రామాలకు మహిళా సంఘాల భవనాలు మంజూరు అయినట్లు రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యకి రాజపేట మండల ప్రజల, మహిళల తరపున ధన్యవాదాలు తెలిపారు. మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే , మహిళా సంఘాలకు సొంత భవనాలు మంజూరు చేయడం ద్వారా గ్రామీణ మహిళల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, పొదుపు కార్యక్రమాలు చేపట్టడానికి, స్వయం ఉపాధి శిక్షణ పొందడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఎల్లప్పుడూ మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న బీర్ల ఐలయ్యకి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వడదెబ్బకు గుర్రై గోపగాని శ్రీధర్ మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వడదెబ్బకు గురై రాజపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన కూలి గోపగాని శ్రీధర్ (38) ఆదివారం మృతి చెందాడు. కూలి పనికివెల్లి తిరిగి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం భువనగిరి ఆసుపత్రికి తరలించగా శ్రీధర్ మరణించినట్లు సర్పంచి పయ్యావుల ఎల్లయ్య తెలిపారు. పేద కూలి కుటుంబానికి చెందిన శ్రీధర్ కు ఇద్దరు కుమార్తెలు. కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లు అయిందని వెంటనే మానవత్వంతో ప్రభుత్వం ఆదుకోవాలని అందుకోసం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవ చూపాలని సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య కోరారు.

# మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలుకి ఆత్మీయ సన్మానం....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు పురపాలక సంఘం కో–ఆప్షన్ సభ్యురాలు ఎం ఏ. ఇంతియాజ్ ఇర్ఫాన్ ఇక్బాల్ కి ఆదివారం రోజున ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఐఎన్టియుసి యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎర్రజెండా భుజాన వేసుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ. ఇక్బాల్ సతీమణి ఇంతియాజ్ ఇర్ఫాన్ కి కో–ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ఆలేరు శాసనసభ్యులు బీర్ల. ఐలయ్యకి, సిపిఎం పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్ముందు ఇంకా అనేక కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# 7వ రోజు కొనసాగిన వివోఏల సమ్మె దీక్షలు....

**- వివోఏల సమస్యలు పరిష్కారం అయ్యేదాక పోరాటం కొనసాగిస్తాం**
**- వివోఏ జేఏసి జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష**




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆత్మకూరు(ఎం) మండల మహిళ సమాఖ్య కార్యాలయం ఎదుట మహిళ సంఘాలలో గ్రామ సంఘాలకు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వివోఏ లు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన సమ్మె 7 వరోజుకు చేరుకుంది. మండల కేంద్రం లోని మహిళ సమాఖ్య కార్యాలయం ఆదివారం 7 వ రోజు నిరసన దీక్షలో వివోలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వివోఏ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష మాట్లాడుతూ.... వివోఏ లకు కనీస వేతనం 20 చేయాలి. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి సెర్ప్ ఉద్యోగులు గా గుర్తించాలి అర్హులైన వివోఏలకు సీసీ లుగా ప్రమోషన్ ఇవ్వాలి. 58 జీవో ను సవరించి న్యాయం చేయాలి అని డిమాండ్ చేసారు. తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేసేదాకా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ దీక్షల్లో వివోఏ జేఏసి నాయకులు మేడి రామ్ లక్ష్మణ్, వేముల నర్సింహ్మా, గొర్రెంకల నిర్మల, సుదగాని సూరమంభ, పోలేపాక భాగ్యమ్మ, కే శ్రీనివాస్, పి సునీతా, తుమ్మల సరిత, యాస మహేశ్వరీ, ప్రమీల, శ్యామల, లావణ్య,బూడిద సుచరిత, ఎం జయమ్మ, మౌనిక, ఉపేంద్ర, నాగరాణి తదితరులు కూర్చున్నారు

# 26 నుంచి 'రైతు గోసా - బీజేపీ భరోసా' యాత్ర....

**కాంగ్రెస్ హామీలు వెంటనే అమలు చేయాలి: వేముల అశోక్**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రైతుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ ఈ నెల 26 నుంచి 'రైతు గోసా – బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టనుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర జిల్లా మీదుగా వివిధ మండలాల్లో కొనసాగుతుందని చెప్పారు. రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితులను తెలుసుకుంటామని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడిస్తామని, తమకు ముఖ్యంగా రైతుల సంక్షేమమే లక్ష్యమని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ యాత్రను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాయ దశరథ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, భువనగిరి పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, పాదరాజు ఉమాశంకర్, బబ్బూరి సురేష్, మండల అధ్యక్షుడు చిరిక సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగొద్దు

**అధికారులను ఆదేశించిన ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల వీరేశం**
**28లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కేతపల్లి, నకిరేకల్, కట్టంగూర్ మండలాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లను ఈ నెల 28వ తేదీలోపు పూర్తిచేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. నకిరేకల్ ఎంఆర్వో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మూడు మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై అధికారులతో చర్చించారు. మొత్తం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 23 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన అన్ని కేంద్రాల్లో కూడా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, మాధవ్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# రైతులు ధాన్యం నిల్వ చేసేందుకు వడ్ల గోదామును ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని రామాజీపేట గ్రామంలో ఉన్న పత్తి విత్తనాల కంపెనీని వడ్ల గోదాం గా మార్చడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆ గోదామును ఆర్డీవో కృష్ణ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. రైతులు ధాన్యం నిల్వ చేసేందుకు రైతులకు ఇబ్బందులు పడకుండా ఉండాలని భావించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులతో ప్రత్యేకంగా చర్చించి ఈ గోదాం ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో రామాజీపేటతో పాటు పరిసర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలో సుమారు 85 శాతం వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ గోదాం ఏర్పాటు వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ధాన్యాన్ని సమయానికి విక్రయించే అవకాశం లభిస్తుందన్నారు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# "ఎల్ నినో" : 70 ఏళ్ల చరిత్ర..! రుతుపవనాలను మార్చేయబోతున్న మెగా చేంజ్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24 :**
ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులను శాసించే 'ఎల్ నినో' ప్రభావం మళ్లీ తెరపైకి వచ్చింది. రాబోయే 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభం నాటికి పసిఫిక్ మహాసముద్రంలో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు ఏర్పడవచ్చని ప్రాథమిక అంచనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా ఎల్ నినో వస్తోందంటే చాలు.. భారత్‌లో కరువు పరిస్థితులు ఏర్పడతాయని, వర్షాలు పడవనే ఆందోళన అందరిలోనూ మొదలవుతుంది.అయితే, ఈసారి రాబోయే ఎల్ నినో వల్ల 2027 భారత రుతుపవనాలకు భారీ నష్టం వాటిల్లుతుందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి తొందరపాటు అవసరం లేదని, భయపడాల్సిన పని లేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. చారిత్రక వాతావరణ నమూనాలను పరిశీలిస్తే.. ఎంతటి బలమైన ఎల్ నినో అయినా సరే, భారత వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే క్రమంగా బలహీనపడిపోతుందని వారు విశ్లేషిస్తున్నారు.వాతావరణ శాస్త్రవేత్తలు 1951 నుండి ఇప్పటివరకు సంభవించిన అతి బలమైన ఎల్ నినో రికార్డులను లోతుగా పరిశీలించారు. ముఖ్యంగా 1982–83, 1997–98, ఇటీవలి 2015–16 నాటి తీవ్రమైన వాతావరణ సంఘటనలను విశ్లేషించినప్పుడు ఒక ఆసక్తికరమైన విషయం బయటపడింది. ఈ బలమైన ఎల్ నినోలన్నీ కూడా ఆయా సంవత్సరాల చివరి నాటికి (అంటే శీతాకాలంలో) గరిష్ట స్థాయికి (ఉచ్ఛస్థితికి) చేరుకుంటాయి. ఆ తర్వాత, సరిగ్గా భారతదేశంలో నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయానికి (వేసవి ముగిసే సరికి) వాటి శక్తిని కోల్పోయి పూర్తిగా బలహీనపడతాయి.

**గత చరిత్ర ఏం చెబుతోంది?**

ఉదాహరణకు, 1997–98 నాటి ఎల్ నినో ప్రభావాన్ని చూస్తే.. 1997 చివరి నాటికి పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఏకంగా 2డిగ్రీల సెల్సియస్ పైగా నమోదయ్యాయి. కానీ, కట్ చేస్తే.. 1998 మధ్యకాలానికి (భారత రుతుపవనాల సమయానికి) వచ్చేసరికి ఆ ఎల్ నినో తన శక్తిని కోల్పోవడమే కాకుండా.. వర్షాలకు అనుకూలించే 'లా నినా' పరిస్థితులుగా మారిపోయింది. 2015–16 లో కూడా సరిగ్గా ఇదే తరహా వాతావరణ నమూనా పునరావృతమైంది. దీనిని బట్టి చూస్తే, తీవ్రమైన ఎల్ నినోలు ఎక్కువ కాలం నిలబడలేవని స్పష్టమవుతోంది.భారత వాతావరణ శాఖకి చెందిన ఒక ఉన్నతాధికారి తెలిపిన వివరాల ప్రకారం.. సాధారణంగా బలమైన ఎల్ నినోలు రుతుపవనాలకు ముందే బలహీనపడి, తటస్థ లేదా వర్షాలను ఇచ్చే లా నినా పరిస్థితులకు దారితీస్తాయి. ప్రస్తుతం పశ్చిమ పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంలో శీతలీకరణ సంకేతాలు (సముద్రం చల్లబడటం) కనిపిస్తున్నాయని, ఇవి వాతావరణంలో రాబోయే సానుకూల మార్పును సూచిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, ఇంత ముందే చెప్పే దీర్ఘకాలిక అంచనాలలో ఎప్పుడూ కొంత అనిశ్చితి (మార్పులు) ఉంటుందని ఆయన హెచ్చరించారు.

**కరువులు గ్యారెంటీ కాదు!**

బలమైన ఎల్ నినో ఏర్పడినంత మాత్రాన భారత రుతుపవనాలు




స్వయంచాలకంగా (ఆటోమేటిక్‌గా) బలహీనపడిపోతాయనే వాదనలో నిజం లేదని నిపుణులు తేల్చిచెప్పారు. ప్రముఖ ప్రైవేట్ వాతావరణ సంస్థ 'స్కైమెట్' వైస్ ప్రెసిడెంట్ జి.పి. శర్మ దీనిపై స్పందిస్తూ.. "గతంలో అత్యంత బలమైన ఎల్ నినో నమోదైన సంవత్సరాలలో భారతదేశంలో కరువులు వచ్చిన దాఖలాలు ఉన్నాయి, అదే సమయంలో సాధారణ వర్షపాతం నమోదైన సందర్భాలూ ఉన్నాయి. కాబట్టి ఇది ఎప్పుడూ మిశ్రమ ఫలితాలనే ఇచ్చింది" అని స్పష్టం చేశారు. భారతదేశంలో కురిసే వర్షపాతాన్ని కేవలం ఎల్ నినో ఒక్కటే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉండే అనేక ఇతర సంక్లిష్ట వాతావరణ కారకాలు ప్రభావితం చేస్తాయని ఆయన వివరించారు. కాబట్టి 2027 వర్షాలపై ఇప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# అమెరికా - ఇరాన్ యుద్ధం సామాన్యుడిపై మోయలేని భారం

**సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఏర్పడిన సంక్షోభం భారతదేశంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పడిందని వారి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోందని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆలేరులో నూతనంగా ఎన్నికైన సిపిఎం నాయకులు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ ఇంతియాజ్ ఇర్ఫాన్ అభినందన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన "అంతర్జాతీయ యుద్ధాలు – దేశీయ నిత్యావసరాల ధరలపై ప్రభావం" అనే సెమినార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ?ఈ సందర్భంగా జరిగిన సెమినార్ లో ఎండి జహంగీర్ మాట్లాడుతూ.... భారతదేశం తన అవసరాలకు కావాల్సిన ముడిచమురులో 85 శాతానికి పైగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుందని ఆయన గుర్తుచేశారు. ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలమార్గాన్ని మూసివేయడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయని, దీనివల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. లారీల రవాణా ఛార్జీలు పెరగడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు, వంటనూనెల ధరలు మార్కెట్లో సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయని మండిపడ్డారు. నిత్యం వాడే సబ్బులు, ప్యాకేజ్డ్ వస్తువులపై కంపెనీలు భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ?యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా రసాయన ఎరువుల ముడిపదార్థాల సరఫరా దెబ్బతిని, దేశంలో ఎరువుల కొరత, ధరల పెరుగుదల ఏర్పడిందని, దీనికి తోడు డీజిల్ ధరల పెరుగుదల వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముడి చమురు దిగుమతుల కోసం దేశం ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ తీవ్రంగా పడిపోతోందని, ఫలితంగా విదేశాల నుండి వచ్చే ప్రతీ వస్తువు ప్రియమవుతోందని అన్నారు. ఒక సగటు కుటుంబంపై నెలకు కనీసం రూ. 2,500 ల అదనపు భారం పడుతున్నా కేంద్ర ప్రభుత్వం ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ?యుద్ధాల పేరుతో అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దేశాలు అంతర్జాతీయ కార్పొరేట్ శక్తులు, చేస్తున్న దాడుల వల్ల ఇక్కడ ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలు నలిగిపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.?ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, సిపిఎం పట్టణ నాయకులు మోరిగాడి రమేష్, మండల నాయకులు సూదగాని సత్య రాజయ్య, జూకంటి పౌలు, వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేష్, మొరిగాడి మహేష్ చెన్న రాజేష్ మాదాని నవీన్, యాసారపు ప్రసాద్, కాసుల నరేష్, మోరీగాడి అజయ్, ముప్పిడి యాదగిరి, సంఘీ రాజు, పిక్క గణేష్, చింతల సరిత నాగరాజు, మహిళా సంఘం నాయకులు మోరిగాడి భాగ్యలక్ష్మి, మోరీగాడి స్వరూప, ఘనగాని భాగ్యలక్ష్మి, మొరిగాడి మహాలక్ష్మి, అనిత, బొప్పిడి యశోద మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే ప్లాట్‌ఫాంపై ప్రసవం

తాండూరు, తాండూరు రూరల్, మే 24: రైల్వే ప్లాట్‌ఫాంపై ఓ మహిళ ప్రసవించింది. ఈ సంఘటన తాండూరు రైల్వేస్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. తాండూరు మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన మహేశ్వరి కొన్నాళ్లుగా భర్తతో దూరంగా ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. గర్భవతి అయిన మహేశ్వరిని కుటుంబసభ్యులు వారం రోజుల క్రితం తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఆమెకు ఫిట్స్ రావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మహేశ్వరి శనివారం రాత్రి తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఒంటరిగా ఉన్న ఆమెకు ఉన్నట్టుండి పురుటి నొప్పులు రావడంతో తోటి ప్రయాణికులు గమనించి 108కు సమాచారం అందించినా.. వారు స్పందించలేదు. అప్పటికే సదరు మహిళ ఆడపిల్లకు జన్మనిచ్చింది. గమనించిన ముస్తాఫా అనే ఓ ఆటో డ్రైవర్ అర్ధరాత్రి 2 గంటల సమయంలో తల్లీబిడ్డను సురక్షితంగా ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నాడు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి ఆదివారం ఉదయం ఆస్పత్రిలో తల్లీబిడ్డను పరామర్శించారు.



# విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

**అక్రమార్కులకు తొత్తులుగా మారిన అధికారులపై తక్షణమే వేటు వేయాలి.....**

**ప్రెస్ మీట్ లో మాట్లాడుతున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రారెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి జిల్లాలో, ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ పరిపాలన ఎంత దారుణంగా భ్రష్టు పట్టిపోయిందో, ఇక్కడి అధికారులు ఎంత మొద్దునిద్ర పోతున్నారో ప్రజలందరికీ వివరించడానికే ఈ ప్రెస్ మీట్. పెట్టినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టకు రావడం ఇది ఐదో సారి. ముఖ్యమంత్రి రావడం వల్ల ఆలేరు నియోజకవర్గానికి, జిల్లా అభివృద్ధికి ఒక రూ.400 నుండి 500 కోట్ల నిధుల వరాలు ప్రకటిస్తారని, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇస్తారని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఏం జరిగింది? అధికారుల ప్రోటోకాల్ లోపం వల్ల సీఎం ఒక్క మాట కూడా మాట్లాడకుండా, కనీసం మొహం చాటేసి వెనుదిరిగారు. ఇది ఆలేరు నియోజకవర్గ ప్రజల ఆశలపై చన్నీళ్లు చల్లడమే కాదు... వారిని ఘోరంగా అవమానించడమే!"నేను ఈ జిల్లా అధికారులను, ఇక్కడి అధికార పక్ష నేతలను సూటిగా అడుగుతున్నాను... దేశ చరిత్రలో ఎక్కడైనా ఒక ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ అయిన తర్వాత, అధికారుల కోసం 15 నిమిషాల పాటు చాపర్‌లోనే ఎండలో ఎదురుచూసిన దౌర్భాగ్యపు దాఖలాలు ఉన్నాయా? ముఖ్యమంత్రి పదవి అంటే మీకు అంత చులకనా? అంత నిర్లక్ష్యమా? జిల్లా యంత్రాంగం, కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారుల వరకు... అందరూ స్థానిక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే భజనలో తరిస్తూ, అసలు సీఎం ఎక్కడ దిగుతున్నారో కూడా తెలియని సోయి లేకుండా నిద్రపోయారు. 'యథా రాజా.. తథా ప్రజా అన్నట్లు, పాలకులకు పట్టింపు లేకపోతే అధికారులు ఇంతకంటే ఎలా తగలడతారు? ఇలాంటి అధికారులు ఈ జిల్లాకు అవసరమా అని అడుగుతున్నాను."జిల్లాలో ల్యాండ్ మాఫియా, క్రషర్ మాఫియా తోకలాడిస్తుంటే అధికారులు కాపలా వ్యవహరిస్తున్నారు. "కంచే చేను మేసినట్టు' ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు మారారు. మా దగ్గర పక్కా ఆధారాలు ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలోని ఒక సర్వే నెంబర్‌లో ఉన్న 726 లో ప్రభుత్వ భూమిని ఒక కార్పొరేట్ రియల్ ఎస్టేట్ సంస్థ కాజేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు? పూర్తి డేటాతో సహా మేము స్వయంగా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు చప్పుడు లేదు.'చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు' మా ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. చల్లూరు గ్రామంలోని సర్వే నెంబర్ 324లో ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్రషర్ నడుపుతున్నారు. ప్రభుత్వ ఆదాయం కొల్లగొడుతున్నారు అని ఆధారాలు ఇచ్చినా కనీసం ఆ అక్రమ క్రషర్ వైపు కన్నెత్తి చూసిన అధికారి లేడు. హైదరాబాద్ ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న అక్రమ క్రషర్లను అక్కడి అధికారులు తోకలు కత్తిరించి కూల్చేస్తుంటే... మరి యాదాద్రి జిల్లా అధికారులు ఇక్కడి అక్రమార్కులకు ఎందుకు కొమ్ముగాస్తున్నారు? మీకు అందుతున్న వాటాలెంత? మీ జేబులు ఎంతలా నిండుతున్నాయి? ఈ జిల్లాలో దేవుడి వరమిచ్చినా పూజారి వరమివ్వనట్టు' తయారైంది పరిస్థితి. అటు దేవుడికి శాంతి లేదు, ఇటు రైతుకు న్యాయం లేదు. ఐదు సార్లు వచ్చిన రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిన పనులను ముందుకు తీసుకెళ్లడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. రూ. 200 కోట్ల పనులు నిధులు లేక నత్తనడకన సాగుతున్నాయి.ఇక రైతుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోంది. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో అల్లాడిపోతున్నారు. మక్కా (మొక్కజొన్న) లోడుతో లారీలు రోడ్లపై బారులు తీరినా పట్టించుకునే నాథుడే లేడు. బస్వాపురం రిజర్వాయర్, గంధమల్ల రిజర్వాయర్ పనులు పడకేసాయి. ముంపు బాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా వారి ఉసురు పోసుకుంటున్నారు. "కాబట్టి, మేము ఈ ప్రెస్ మీట్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని డిమాండ్ చేస్తున్నాం...'రోగం ఒకటైతే మందు ఇంకొకటి వేసినట్లు' కాకుండా... వెంటనే యాదాద్రి జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి. అధికార పక్ష నేతల భజనలో మునిగి తేలుతూ, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, అక్రమార్కులకు తొత్తులుగా మారిన అధికారులపై తక్షణమే వేటు వేయాలి. బాధ్యులైన వారిని సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఆలేరు నియోజకవర్గానికి పెండింగ్ నిధులు విడుదల చేసి, ఇక్కడి రైతాంగాన్ని, ప్రజలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో మీ పరిపాలనపై ప్రజల పక్షాన పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తాం, రోడ్ల మీదకు వచ్చి ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు.

# కర్డ్ రైస్‌ను మించిన టేస్ట్‌తో "బార్లీ జావ"



సమ్మర్‌లో ఆరోగ్యానికి మంచిదని చాలా మంది జావలు తాగుతుంటారు. మరీ ముఖ్యంగా ఎక్కువ మంది రాగి పిండితో, జొన్న పిండితో తయారు చేసుకుని మజ్జిగ కలిపి తాగుతుంటారు. అయితే కేవలం వీటితో మాత్రమే కాకుండా బార్లీతో కూడా రుచికరమైన జావ చేసుకోవచ్చు. ఇది జావ మాదిరి తాగడానికి కాకుండా కర్డ్ రైస్ టైప్‌లో ఉంటుంది. హాయిగా తినొచ్చు. టేస్ట్ చాలా బాగుంటుంది. బార్లీలో శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందించే గుణాలు పుష్కలంగా ఉంటాయి. మరి లేట్ చేయకుండాఈ బార్లీ జావను ప్రిపేర్ చేసుకోవడానికి ఈ స్టోరీపై ఓ లుక్కేయండి.

కావాల్సిన పదార్థాలు:
బార్లీ - ఒక కప్పు
ఉప్పు - రుచికి సరిపడా
పెరుగు - 1 కప్పు
పచ్చిమిర్చి - 3
క్యారెట్ - 1
అల్లం - చిన్న ముక్క
కొత్తిమీర తరుగు - కొద్దిగా
కరివేపాకు - 2 రెమ్మలు
నూనె - 1 టీస్పూన్
ఆవాలు - అర టీస్పూన్
జీలకర్ర - అర టీస్పూన్
ఇంగువ - చిటికెడు

తయారీ విధానం:
గిన్నెలోకి బార్లీ గింజలు తీసుకుని రెండు మూడు సార్లు కడిగి రాత్రంతా నానబెట్టుకోవాలి. బార్లీ ఎంత నానితే అంత తొందరగా ఉడకడంతో పాటు టేస్ట్ అద్దిరిపోతుంది.
బార్లీ నానిన తర్వాత నీళ్లు లేకుండా కుక్కర్‌లోకి తీసుకోవాలి. అందులోకి ఒక కప్పు బార్లీకి రెండు కప్పుల నీరు పోసుకుని మూత పెట్టి విజిల్ ఉంచాలి.
స్టవ్? ఆన్? చేసి కుక్కర్ గిన్నె పెట్టి మీడియం ఫ్లేమ్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.
కుక్కర్? ఆవిరి పోయినాక మూత తీసి ఉడికించిన బార్లీని జల్లి గిన్నెలోకి వేసుకుని పక్కన పెట్టుకోవాలి. బార్లీ ఉడికించిన నీటిని పడేయాల్సిన అవసరం లేకుండా పక్కకు పెట్టుకోవాలి.
బార్లీ చల్లారిన తర్వాత మిక్సీజార్‌లోకి వేసి మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగా గ్రైండ్ చేసుకుని తీసుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం ఏమైనా గట్టిగా అనిపిస్తే రుబ్బుకునేటప్పుడు కొన్ని నీళ్లు యాడ్ చేసుకోవచ్చు.
రుబ్బుకున్న బార్లీలోకి పెరుగు, కొన్ని నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి అంతా కలిసేలా మిక్స్ చేసుకుని పక్కన ఉంచాలి.
ఇప్పుడు పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, కరివేపాకును సన్నగా కట్ చేసుకోవాలి. అలాగే క్యారెట్‌పై పొట్టు తీసేసి సన్నగా తురుముకుని పక్కన ఉంచాలి.
బార్లీ మిశ్రమంలోకి కొత్తిమీర తరుగు, క్యారెట్ తురుము వేసి మిక్స్ చేసుకుని పక్కన ఉంచాలి.
స్టవ్? ఆన్?? చేసి కడాయి పెట్టి నూనె వేసుకోవాలి. ఆయిల్ కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఇవి చిటపటలాడిన తర్వాత ఇంగువ, పచ్చిమిర్చి, అల్లం తరుగు, కరివేపాకు వేసి ఓ నిమిషం వేయించాలి.
తాలింపు చక్కగా వేగినాక స్టవ్ ఆఫ్ చేసి బార్లీలో యాడ్ చేసుకుని అంతా కలిసేలా మిక్స్ చేసుకుని సర్వ్ చేసుకుంటే ఎంతో టేస్టీ బార్లీ జావ రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి.

టిప్స్:
బార్లీ గింజలను రాత్రంతా నానబెట్టడం వలన అవి త్వరగా ఉడుకుతాయి. ఉదయం చేసుకోవాలనుకుంటే ముందు రోజు రాత్రి, నైట్‌కు అయితే అదే రోజు ఉదయం నానబెట్టుకుంటే సరిపోతుంది. ఒకవేళ నానబెట్టుకునే టైమ్ లేకపోతే ఎక్కువ విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకుంటే సరిపోతుంది.
బార్లీ జావను తయారుచేసేటప్పుడు, గింజలు పూర్తిగా ఉడికేలా చూసుకోవాలి.
బార్లీ జావను మరింత రుచికరంగా చేయడానికి నిమ్మరసం, పండ్ల ముక్కలు కూడా కలుపుకోవచ్చు.
బార్లీ ఉడికించిన నీటిని పారబోయకుండా ఆ నీటిలో కాస్త ఉప్పు, నిమ్మరసం కలుపుకుని తాగితే ఆరోగ్యానికి మంచిది కూడా.

# మీ చిన్న పొరపాట్లు ఎముకలను బలహీనపరుస్తాయి.. జాగ్రత్త!

ఇంటర్నెట్ డెస్క్: మన రోజువారీ జీవితంలో చేసే కొన్ని చిన్న తప్పులు కూడా ఎముకల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా కాల్షియం లోపం వల్ల ఎముకలు బలహీనపడే ప్రమాదం ఉంది. కాల్షియం మన ఎముకలు, పళ్లు బలంగా ఉండటానికి మాత్రమే కాకుండా, కండరాలు, నాడీ వ్యవస్థ సరిగా పనిచేయడానికి కూడా అవసరం.

**ఎముకలకు హానికరమైన ఆహారాలు:**
శీతల పానీయాలను ఎక్కువగా తాగితే శరీరంలో కాల్షియం తగ్గుతుంది. ఇవి కాల్షియం శోషణను అడ్డుకుంటాయి.ఎర్ర మాంసం, ప్రాసెస్ చేసిన మాంసాన్ని అధికంగా తింటే కాల్షియం శోషణ తగ్గి ఎముకలు బలహీనపడతాయి.బేకరీ పదార్థాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది, ఇవి ఎముకల ఆరోగ్యానికి హానికరం.టీ, కాఫీలలోని కెఫీన్ కాల్షియం శోషణను తగ్గిస్తుంది. ఎక్కువగా తాగితే ఎముకలు బలహీనమవుతాయి.మద్యం ఎక్కువగా తాగితే ఎముకల బలం తగ్గి విరిగే ప్రమాదం పెరుగుతుంది.ఫ్రైడ్ ఫుడ్ ఎక్కువగా తింటే శరీరంలో వాపు పెరిగి, కాల్షియం శోషణ తగ్గుతుంది.

**ఎముకలకు మేలు చేసే ఆహారం:**
పాలు, పెరుగు,ఆకుకూరలు,తాజా పండ్లు,కోడి గుడ్డు,నట్స్



**జాగ్రత్తలు**
రోజూ కొంత వ్యాయామం చేయాలి.ఉదయం, సాయంత్రం ఎండలో కాసేపు ఉండాలి.ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.ఎముకలు బలంగా ఉండాలంటే సరైన ఆహారం, మంచి అలవాట్లు చాలా ముఖ్యం. చిన్న పొరపాట్లను సరిచేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.

# భోజనం తర్వాత చేయకూడని పనులు ఇవే

ఇంటర్నెట్ డెస్క్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, బలంగా ఉండాలనే ఉద్దేశంతో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు. సమయానికి భోజనం చేస్తారు. అయితే మీరు ఎంత ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా, భోజనం చేసిన వెంటనే చేసే కొన్ని చిన్న తప్పులు మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.భోజనం తర్వాత చేసే అలవాట్లు జీర్ణవ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే క్రమంగా జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి భోజనం తర్వాత చేయకూడని కొన్ని తప్పులు ఏమిటో తెలుసుకుందాం..

**తిన్న వెంటనే నిద్రపోవడం:**
భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం వల్ల ఆహారం సరిగా జీర్ణం కాదు. దీని వల్ల గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి కనీసం 30 నిమిషాల తర్వాతే నిద్రపోవడం మంచిది.

**టీ లేదా కాఫీ తాగడం:**
భోజనం వెంటనే టీ లేదా కాఫీ తాగడం వల్ల శరీరంలో ఇనుము శోషణ తగ్గుతుంది. దీని వల్ల రక్తహీనత వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి భోజనం తర్వాత కనీసం 45 నిమిషాల తర్వాత మాత్రమే టీ లేదా కాఫీ తాగాలి.

**ఎక్కువగా నీరు తాగడం:**
భోజనం చేసిన వెంటనే ఎక్కువ నీరు తాగడం జీర్ణరసాలను దెబ్బతీస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అందుకే భోజనం సమయంలో కొద్దిగా నీరు తాగినా సరే, వెంటనే ఎక్కువగా నీరు తాగకూడదు.



**తిన్న వెంటనే స్నానం చేయడం:**
భోజనం చేసిన వెంటనే స్నానం చేస్తే రక్త ప్రసరణ కడుపు నుంచి చర్మానికి మళ్లుతుంది. దీని వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. కాబట్టి కనీసం ఒక గంట తర్వాతే స్నానం చేయడం మంచిది. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి, శరీరం కూడా ఫిట్‌గా ఉంటుంది.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.